ప్రజాశక్తి

శనివారం 19 అక్టోబర్ 2024 8 పేజీలు

ప్రకాశం

బాపట్ల

ఇసుక, మద్యం దోపిడీకి..

నాయకులే మారారు..పద్ధతి మారలా..!

- సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు
- వరద బాధితులకు దుస్తులు పంపిణీ

వరద బాధితులకు దుస్తులు అందజేస్తున్న వి.శ్రీనివాసరావు

ప్రజాశక్తి-భట్టిప్రోలు, కొల్లూరు

ఇసుక, మద్యం దోపిడీకి నాయకులు మారారే తప్ప పద్ధతి మారలేదని సిపిఎం రాష్ట్ర కార్యదర్శి వి.శ్రీనివాసరావు పేర్కొన్నారు. సిపిఎం రాష్ట్ర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం భట్టిప్రోలు మండలం, పెదలంక, కొల్లూరు మండలం తిప్పలకట్ట గ్రామాలలో వరద బాధితులకు చీరలు, దుప్పట్లు, కండువాలను పంపిణీ చేశారు. ఈ సందర్భంగా కొల్లూరు ప్రజా సంఘాల కార్యాలయంలో ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో శ్రీనివాసరావు మాట్లాడారు. ఇప్పుడు ఎక్కడబడితే అక్కడ మద్యం షాపులు పెట్టడానికి ముందుకు వెళుతున్నారని, స్కూలు దగ్గర జనావాసాల దగ్గర పెట్టవద్దని మహిళలు పెద్ద ఎత్తున వ్యతిరేకిస్తున్నారని, అందువల్ల మహిళలు, ప్రజల అభిప్రాయాలు తీసుకుని మద్యం షాపులు పెట్టాలని సూచించారు. మహిళలకు, పిల్లలకు అసౌకర్యం కలిగించకుండా చూడాలని ప్రభుత్వాన్ని కోరారు. సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు డి.రమాదేవి మాట్లాడుతూ వరదల కారణంగా దెబ్బతిన్న గ్రామాల్లో డ్వాక్రా మహిళలకు బ్యాంకు రుణాలను రద్దు చేయాలని భట్టిప్రోలు, కొల్లూరు మండలాల్లో ఎంపీడీవోలకు విన్నవించామన్నారు. ముఖ్యంగా లంక గ్రామాల్లో కూలీలకు గత మూడు ఏళ్లుగా ఉపాధి హామీ పథకం పనులు లభించడం లేదన్నారు. ఈ రెండు గ్రామాల్లో రూ.2,40,000 విలువచేసే దుస్తులను 800 కుటుంబాలకు అందజేసినట్లు తెలిపారు. సిపిఎం బాపట్ల జిల్లా కార్యదర్శి సిహెచ్.గంగయ్య మాట్లాడుతూ సిపిఎం ఆధ్వర్యంలో బాధితులకు 2లో

పశ్చిమ ప్రాంతంలో దంచికొట్టిన వాన 3లో

ఇసుక, మద్యం విషయంలో..

జోక్యం చేసుకోవద్దు..

- ఎమ్మెల్యేలకు సిఎం చంద్రబాబు హితబోధ
- ఆదాయం కోసం ఇప్పటికే వాటిపై ప్రజాప్రతినిధుల దృష్టి

ప్రజాశక్తి-ఒంగోలు బ్యూరో

'ఇసుక, మద్యం వ్యాపారాల్లో ఎవరూ జోక్యం చేసుకోవద్దు. కొత్తగా లిక్కర్ వ్యాపారంలోకి వచ్చి సంపాదించుకోవాలని చూడొద్దు. నాయకుడికి విశ్వసనీయత రావడానికి ఎంత సమయం పట్టినా అది పోవడానికి నిమిషం చాలు..' సిఎం చంద్రబాబునాయుడు టిడిపి ఎమ్మెల్యేలనుద్దేశించి చేసిన వ్యాఖ్యలు ఇవీ.. శుక్రవారం నాడు అమరావతిలో ఆయన పార్టీ ఎంపీలు, ఎమ్మెల్యేలతో ప్రత్యేక సమావేశం నిర్వహించారు. వంద రోజుల తర్వాత ఏర్పాటుచేసిన సమావేశం కావడంతో ప్రాధాన్యత సంతరించుకుంది. ఇప్పటివరకూ ఎదుర్కొన్న సవాళ్లను, గత ఐదేళ్లు పడ్డ కష్టాలను వివరించిన చంద్రబాబు భవిష్యత్‌లో ఎలా నడుచుకోవాలో దిశానిర్దేశం చేశారు. గెలిచాం కాబట్టి మన పనైపోయిందనుకుంటే నష్టపోతామంటూ హెచ్చరికలు చేశారు.

ఎమ్మెల్యేలు ఏ తప్పు చేసినా అది సిఎం పైనే పడుతుందని చంద్రబాబు గుర్తుచేశారు. కొత్తగా గెలిచిన ఎమ్మెల్యేలూ, కొత్తగా మంత్రులైన వారూ భవిష్యత్‌లో ఏ తప్పులు చేయకుండా ముందుకుపోవాలని సూచించారు. ఆయన ఉపన్యాసమంతా నేతల నడక ఎలా ఉండాలనే దానిపైనే సాగింది. ఒక నాయకుడిగా ఆయన చేసిన ప్రసంగం వారి ఎమ్మెల్యేలకు దిశానిర్దేశం చేసేలాగే ఉంది. వినడానికి బాగానే ఉంది. అయితే ఆచరణలో ఏం జరుగుతుందన్నదే చర్చగా మారింది. ఏఏ అంశాల జోలికి వెళ్లొద్దని సిఎం చంద్రబాబు ఇప్పుడు గట్టిగా చెప్పారో అవే ఇప్పుడు కీలకంగా మారాయి. గతంలోనూ ఎమ్మెల్యేలను ఉద్దేశించి ఆయన పలుమార్లు ఇదే తరహా హెచ్చరికలు చేశారు. కొందరు పనితీరుపై వచ్చిన ఆరోపణలను గట్టిగానే గుర్తుచేశారనే చర్చ కూడా లేకపోలేదు. ఇక జిల్లాలో పాలకపక్ష ఎమ్మెల్యేలు కొందరిపై పలు రకాల ఆరోపణలూ వస్తున్నాయి. ఆదాయం కోసం ఎంచుకున్న అంశాలపై ఇప్పటికే బహిరంగంగానే చర్చ సాగుతోంది. ఇసుకలో జోక్యం తీవ్రంగానే ఉంది. ఉచిత ఇసుకకు పాలకపక్ష నేతల తీరు వల్లే నష్టం జరుగుతోంది. దీనిపై కలెక్టర్, ఎస్పీలు కూడా మీడియా సమావేశం పెట్టిమరీ హెచ్చరించారు. ఉచిత ఇసుక పథకం అమలు చేస్తున్నట్లు రాష్ట్రప్రభుత్వం చెబుతుంటే బహిరంగ మార్కెట్‌లో ఇసుక ట్రక్కు రూ.6 వేలు అమ్ముతోంది. రీచ్‌ల నుంచి పాలకపక్ష నేతల కనుసన్నల్లోనే ట్రక్కులకు ఎత్తుతున్నారు. అక్కడే ట్రక్కుకు ఇంతని వసూలు చేస్తున్నారు. దీంతో ఇదొక పెద్ద వ్యాపారంగానే మారింది. వాగులు, వంకలు, నదుల నుంచి ఇసుక అక్రమంగా తరలించి సొమ్ము చేసుకుంటున్నారు. అధికారులు ఏమీ చేయలేకపోతున్నారు. ఇప్పటికీ ఇసుక వ్యవహారం కొలిక్కి రాలేదు. ఇక లిక్కర్ వ్యాపారం తెరపైకి వచ్చింది. జిల్లాలో 171 దుకాణాల్లో 2లో

సైలెన్సర్లతో ఇబ్బందులు కలిగిస్తే

కఠిన చర్యలు: ఎస్పీ

రోడ్ రోలర్‌తో మోడిఫైడ్ సైలెన్సర్ల ధ్వంసం

రోడ్డురోలర్‌తో సైలెన్సర్లను తొక్కిస్తున్న ఎస్పీ

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

రణగొణ శబ్దాన్నిచ్చే సైలెన్సర్ అమర్చుకుని ప్రజలు, తోటి ప్రయాణికులకు ఇబ్బందులు కలిగిస్తే చట్టపరమైన చర్యలు తీసుకుంటామని ఎస్‌పి ఏఆర్ దామోదర్ హెచ్చరించారు. నెల రోజులో ఒంగోలు నగర పరిధిలో ట్రాఫిక్ పోలీసులు స్పెషల్ డ్రైవ్ చేపట్టి ద్విచక్ర వాహనాలకు మాడిఫైడ్ సైలెన్సర్ల ద్వారా అధిక శబ్దం చేసే 515 సైలెన్సర్ లను స్వాధీనం చేసుకున్నారు. శుక్రవారం ఒంగోలులోని అద్దంకి సెంటర్ వద్ద జిల్లా ఎస్‌పి సమక్షంలో వాటిని రోడ్ రోలర్ తో ధ్వంసం చేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ మోటార్ వాహనాల చట్టం నిబంధనలు ఉల్లంఘించి ద్విచక్ర వాహనాల కంపెనీ తయారీదారులు ఇచ్చిన సైలెన్సర్ స్థానంలో 2లో

విద్యుత్ భవన్ వద్ద నిరసన తెలుపుతున్న సిపిఎం నాయకులు

సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి

- స్మార్ట్ మీటర్లను ఉపసంహరించుకోవాలి
- సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్
- విద్యుత్ భవన్ వద్ద నిరసన

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలను రద్దు చేయాలని సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ డిమాండ్ చేశారు. విద్యుత్ సర్దుబాటు ఛార్జీల రద్దు, స్మార్ట్ మీటర్లు పెట్టవద్దని కోరుతూ సిపిఎం ఒంగోలు నగర కమిటీ ఆధ్వర్యంలో శుక్రవారం ఒంగోలు విద్యుత్ భవన్ ఎస్‌ఇ కార్యాలయం వద్ద శుక్రవారం నిరసన తెలియజేశారు. కార్యక్రమానికి సిపిఎం ఒంగోలు నగర కార్యదర్శి జి.రమేష్ అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా సిపిఎం జిల్లా కార్యదర్శి సయ్యద్ హనీఫ్ మాట్లాడుతూ ఒకవైపు నిత్యవసర వస్తువులు ధరలు నింగినంటుతున్నాయని, మరోవైపు కరువు, వరదలు, వ్యాధులు వెంటాడుతున్నాయన్నారు. ఈ స్థితిలో ప్రజలకు ఉపశమనం కలిగించకపోగా గత ప్రభుత్వం పద్ధతిలోనే విద్యుత్ సర్దుబాటు ఛార్జీల పేరిట 2022-23 సంవత్సరానికి సంబంధించి రూ.8113 కోట్లు, 2023-24కు సంబంధించి రూ.11 వేల కోట్లకు పైగా భారాలు ప్రజలపై మోపుతున్నారన్నారు. వీటిని రద్దు చేయాలని సిపిఎం డిమాండ్ చేస్తుందన్నారు. నేడు ఈఆర్‌సి ఎదుట ఛార్జీలపై ప్రజల అభిప్రాయాన్ని స్వీకరిస్తుందని, ప్రజలు వ్యతిరేకించిన ఛార్జీలు విధిస్తున్నారన్నారు. బాదుడే బాదుడు కార్యక్రమాన్ని టిడిపి ప్రతిపక్షంలో ఉన్నప్పుడు నిర్వహించారని, ఇప్పుడు అధికారంలోకి వచ్చాక ప్రజలపై భారాలు మొదలుపెట్టారన్నారు. విద్యుత్ రంగంలో ప్రజా వ్యతిరేక సంస్కరణతో ఈ భారాలు విధిస్తున్నారని, దీంతో కార్పొరేట్ కంపెనీలు 2లో

3,749 హెక్టార్లలో పంట నష్టం

- నష్టపోయిన 3,231 మంది రైతులు
- కలెక్టర్‌కు డిఎఒ నివేదికలు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

వాయుగుండం కారణంగా కురిసిన భారీ వర్షాలతో జిల్లాలో 3749 హెక్టార్లల్లో రైతులు సాగు చేసిన పంటలకు నష్టం వాటిల్లినట్లు కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియాకు జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాసరావు ప్రాథమిక నివేదిక అందజేశారు. ఆయా పంటలు సాగు చేసిన 1070 మంది రైతులు నష్టపోయినట్లు నివేదికలో పేర్కొన్నారు. సజ్జ 9 మండలాలలోని 54 గ్రామాలలో 1747 హెక్టార్లల్లో సాగు చేసిన పంట దెబ్బతిందని, 1642 మంది రైతులు నష్టపోయారన్నారు. మినుము పంటను 3 మండలాలలోని 19 గ్రామాలలో 544 హెక్టార్లల్లో సాగు చేసిన పంట దెబ్బతిందని, 625 మంది రైతులు నష్టపోయారన్నారు. జొన్న పంటను ఒక మండలంలో ఒక గ్రామంలో 3 హెక్టార్లల్లో సాగైన పంట దెబ్బతిందని, ఇద్దరు రైతులు నష్టపోయారన్నారు. అలసందలు ఒక మండలంలోని 10 గ్రామాలలో 1050 హెక్టార్లల్లో సాగు చేసిన పంట దెబ్బతిందని, 876 మంది రైతులు నష్టపోయారన్నారు. పత్తి పంటను ఒక మండలంలోని 2 గ్రామాలలో 25 హెక్టార్లల్లో సాగు చేసిన పంట దెబ్బతిందని, 18 మంది రైతులు నష్టపోయారన్నారు. వరి పంటను రెండు మండలాలలోని మూడు గ్రామాలలో 80 హెక్టార్లల్లో సాగు చేసిన పంట దెబ్బతిందని, 68 మంది రైతులు నష్టపోయినట్లు కలెక్టర్‌కు జిల్లా వ్యవసాయ అధికారి ప్రాథమిక నివేదికను అందజేశారు.

ఇసుక, మద్యం విషయంలో జోక్యం చేసుకోవద్దు..

(మొదటిపేజీ తరువాయి)

80 శాతం తెలుగుదేశం నేతలకే దక్కాయి. మండలస్థాయి నేతలే వ్యాపారులుగా మారారు. ఎమ్మెల్యేలే దగ్గరుండి ప్రతిపక్షం నుంచి ఎవరూ దరఖాస్తులు వేయకుండా వ్యవహారాలు నడిపారు. వ్యాపారాలు ఎలా చేస్తారో చూస్తామంటూ హెచ్చరికలు చేశారు. స్వల్పంగానే ప్రతిపక్షం వారికి దక్కాయి. మిగతావన్నీ పాలకపక్ష మద్దతుదారులవే.. ఇక ఎమ్మెల్యేలు పలువురు దుకాణాల్లోనూ, వచ్చే ఆదాయంలోనూ 20 నుంచి 30 శాతం వాటాలు అడుగుతున్నట్లు సమాచారం. ఇలాగైతే తాము వ్యాపారాలు చేయలేమంటూ దుకాణాలు పొందిన నేతలు లబోదిబోమంటున్నారు. సిఎం చంద్రబాబు వ్యాఖ్యలపై గానీ, హెచ్చరికలపై ఎమ్మెల్యేలు ఇప్పుడు ఎలా స్పందిస్తారో చూడాలి. ఇక ఈ పాటికే రేషన్‌దందాలు నడుస్తున్నాయి. నియోజకవర్గంలో మిగిలిపోయిన బియ్యం మొత్తం సేకరించి బడా వ్యాపారులకు ఇస్తున్నారు. అందుకుగానూ నియోజకవర్గ స్థాయిలో రూ.30 లక్షల నుంచి రూ.40 లక్షల వరకూ ఇచ్చేలా ఒప్పందాలు జరిగాయి. ఈ ప్రక్రియ రెండు నెలల నుంచే నడుస్తోంది. ఇక గ్రానైట్ రంగంలోనూ రాయల్టీ లేకుండా రాళ్లను బయటకు పంపుతున్నారు. దీనికి గతంలో లాగే లారీకి ఇంతని రేట్లు నిర్ణయించి వసూలు చేస్తున్నారు. ఇందులోనూ కొందరు ఎమ్మెల్యేలు కీలకంగా ఉన్నారు. ఇలా ఆదాయాలు వచ్చే మార్గాలపై అనివార్యంగా దృష్టి సారించారు. ఎందుకంటే ఎన్నికల్లో కోట్లు ఖర్చు పెట్టారు. వాటిని రాబట్టుకునేందుకు ఎవరెన్ని అనుకున్నా వెనక్కు తగ్గేలా కనిపించడం లేదు. వదిలేస్తే ఆర్థికంగా దివాళా తీస్తామనే ఆలోచనలో ఉన్నారు. అధినేత చంద్రబాబు మాటలను ఎంతమంది ఆచరణలో పెడతారో చూద్దాం.

నాయకులే మారారు..పద్ధతి మారలా.!

(మొదటిపేజీ తరువాయి)

ఉడతా భక్తిగా అందజేస్తున్న ఈ సహాయాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో సిపిఎం నాయకులు టి.కష్ణమోహన్, సిహెచ్.మణిలాల్, ఎం.సత్యనారాయణ, పి.మనోజ్, జి.నాగరాజు, వేములపల్లి వెంకటరామయ్య, బిఎన్‌కె.ప్రసాద్, టి.సురేష్, బి.సుబ్బారావు, నాగమల్లేశ్వరరావు, నాగరాజు, రైతుసంఘం నాయకులు కె.రామస్వామి, వేములపల్లి వెంకటరామయ్య, బిఎల్‌కె.ప్రసాద్, ముమ్మనేని నాగేశ్వరరావు పాల్గొన్నారు.

సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి

(మొదటిపేజీ తరువాయి)

లాభపడి ప్రజలు నష్టపోతున్నారన్నారు. ఈ విధానాలను రద్దు చేయాలని డిమాండ్ చేశారు. ట్రూ అప్ ఛార్జీలు, సర్దుబాటు చార్జీలు వసూలు నిలిపివేయాలని, సర్దుబాటు చార్జీల విధానాన్ని రద్దు చేసి స్మార్ట్ మీటర్లు పెట్టరాదని కోరారు. కార్యక్రమంలో సిపిఎం జిల్లా కార్యదర్శివర్గ సభ్యులు జివి కొండారెడ్డి, చీకటి శ్రీనివాసరావు, కంకణాల ఆంజనేయులు, జిల్లా కమిటీ సభ్యులు బాలకోటయ్య, బి.రఘురాం, కె.రమాదేవి, జి శ్రీనివాసులు, పి కల్పన, నగర కార్యదర్శి వర్గ సభ్యులు దామా శ్రీనివాసులు తంబి శ్రీనివాసులు, నగర కమిటీ సభ్యులు ఎస్‌డి హుస్సేన్, తంగిరాల మహేష్, బివి రావు పాల్గొన్నారు.

రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలి

ప్రజాశక్తి-తాళ్లూరు: రైతులు యాజమాన్య పద్ధతులు పాటించాలని తాళ్లూరు మండల వ్యవసాయ అధికారి బి ప్రసాద్‌రావు అన్నారు శుక్రవారం మండలంలోని వెలుగువారిపాలెం బొద్దికూరపాడు నాగం బొట్లపాలెం గ్రామాలలో ఇటీవల కురిసిన వర్షాలకు కొంతమేర దెబ్బతిన్న సజ్జ పంటను పరిశీలించారు. రైతులు కంకి మీద ఐదు శాతం ఉప్పు ద్రావణాన్ని పిచికారీ చేస్తే గింజలు బాగుంటాయని రైతుల సూచనలు సలహాలు అందించారు. ముందుగా ఉద్యానవన శాస్త్రవేత్త రవి వెంకన్న బాబుతో కలిసి పండ్ల తోటలను పరిశీలించారు. ఈ కార్యక్రమాలలో ఆయా గ్రామాల విఏఏలు రైతులు పాల్గొన్నారు.

వరి క్షేత్రం పరిశీలన

ప్రజాశక్తి-దర్శి

దర్శిలోని కృషి విజ్ఞాన కేంద్రాన్ని ఆచార్య ఎన్‌జి రంగా వ్యవసాయ విశ్వవిద్యాలయం, విస్తరణ సంచాలకులు డాక్టర్ జి శివ నారాయణ శుక్రవారం సందర్శించారు. ఈ సందర్భంగా కెవికెలోని వివిధ ప్రదర్శన క్షేత్రాల వివరాలను కెవికె హెడ్ డాక్టర్ జి రమేష్ విస్తరణ సంచాలకులకు తెలియజేశారు. అదే విధంగా ఇటీవల కురిసిన వర్షాలకు జిల్లాలో ఏయే పంటలు ఏవిధంగా ముంపునకు గురయ్యాయో కెవికె ప్రధాన శాస్త్రవేత్త రమేష్‌ను అడిగి తెలుసుకున్నారు. రైతులు పంటలను నష్టపోకుండా శాస్త్రవేత్తలు తగు నివారణా చర్యలు ఎప్పటికప్పుడు తెలియజేయాలని ఆదేశించారు. కెవికెలోని వివిధ విభాగాల శాస్త్రవేత్తలు చేపట్టిన క్షేత్ర పరిశీలనలు, ప్రథమ శ్రేణి ప్రదర్శనలు, చిరు సంచుల మరియు సామూహిక ప్రదర్శన క్షేత్రాల యొక్క పురోగతి వివరాలను తెలుసుకున్నారు. చివరగా దర్శి గ్రామంలో ప్రథమ శ్రేణి ప్రదర్శన వరి క్షేత్రాలను కృషి విజ్ఞాన కేంద్రం శాస్త్రవేత్తలతో సంయుక్తంగా పరిశీలించారు. వరి క్షేత్రాలలో ప్రస్తుతం ఉల్లికోడు ఉధృతిని గమనించారు. వాటికి శాస్త్రవేత్తల ద్వారా నివారణ చర్యలను రైతులకు తెలియజేశారు. దర్శి మండల పరిధిలోని ఎస్‌సి రైతులకు పంట నూర్పిడికి, ధాన్యాన్ని ఆరబెట్టుకోవటానికి ఉపయోగపడే టార్పాలిన్ షీట్స్‌ను అతిథుల చేతుల మీదుగా రైతులకు అందజేశారు. ఈ కార్యక్రమంలో కృషి విజ్ఞాన కేంద్రం కార్యక్రమ సమన్వయకర్త డాక్టర్ జి రమేష్, సేద్య విభాగ శాస్త్రవేత్త డాక్టర్ టి వెంకటేశ్వరరెడ్డి, గృహ విజ్ఞాన శాస్త్రవేత్త టి మానస, దర్శి, పులిపాడు గ్రామ రైతులు పాల్గొన్నారు.

రైతులకు టార్పాలిన్ షీట్లు అందజేస్తున్న దృశ్యం

ప్రజలు అప్రమత్తంగా ఉండాలి: విద్యుత్ ఏఈ

ప్రజాశక్తి-దొనకొండ

గత నాలుగైదు రోజులుగా మండలంలో తుఫాన్ ప్రభావిత గ్రామాల్లో విద్యుత్ ప్రమాదాలు జరగకుండా రక్షించేందుకు ప్రజలు అప్రమత్తంగా ఉండాలని, విద్యుత్‌పరంగా ఏ చిన్న సమస్య వచ్చినా తమ సిబ్బందికి తెలపాలని దొనకొండ విద్యుత్ శాఖ ఏఈ నాగూర్ తెలిపారు. మండలంలో అల్ప పీడన ద్రోణి కారణంగా విస్తారంగా వర్షాలు కురిశాయని, జనావాసాలు, పొలాల్లో రైతులు విద్యుత్ పరికరాల దగ్గరకు వెళ్లేటప్పుడు ఆచితూచి అడుగు వేయాలని తెలిపారు. ఎక్కడైనా మీ పరిధిలో విద్యుత్ లైన్‌కు తగులుతున్న పచ్చిచెట్లను ముట్టుకోవద్దని ఆయన తెలిపారు.

అలాగే మహిళలు, చిన్నపిల్లలు కరెంట్ పరికరాలను ముట్టుకోకుండా చూడాలని, తడి బట్టలు ఇనుప తీగలపై ఆరవేయవద్దని, మీరు ప్రయాణం చేసేటప్పుడు ఎక్కడైనా విద్యుత్ లైన్ తెగి పడిఉంటే తాకకుండా సంబంధిత అధికారులకు తెలియజేయాలని కోరారు. వర్షాలు తగ్గు ముఖం పట్టినప్పటికీ మరికొన్ని రోజులు నేల తడిబారి ఉంటుందని గమనించాలని ఆయన తెలిపారు.

పొలాల్లో నీటిని బయటకు పంపించాలి

ప్రజాశక్తి-కనిగిరి

కనిగిరి మండలం ఏరువారిపల్లి మరియు గోసులవీడు రైతు భరోసా కేంద్రాలలో శుక్రవారం 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పి జోష్ణదేవి రైతులు సాగుచేసిన కంది పంటను పరిశీలించారు. అనంతరం రైతులతో మాట్లాడుతూ ప్రస్తుతం అధిక వర్షాలతో పంటల్లో నిలిచి ఉన్న నీటిని చిన్న కాలువల ద్వారా బయటకు మళ్లించాలని తెలియజేశారు. అదే విధంగా యూరియా ద్రావణాన్ని పిచికారీ చేసుకోవాలని సూచించారు. ఏపీ సిఎన్‌ఎఫ్ నారాయణ మాట్లాడుతూ ప్రతి రైతు కనీసం 1/2 ఎకరంలో ప్రకృతి వ్యవసాయం చేపట్టి, తక్కువ ఖర్చుతో దిగుబడులు పొందాలని రైతులకు తెలిపారు. బ్రహ్మాస్త్రం, వేపనూనె, దశ గింజల కషాయం తయారు చేసిన శాంపిల్లను రైతులకు చూపించారు. ఈ కార్యక్రమంలో ఏఎంసి కరిముల్లా ఫిరోజ్, ఏహెచ్‌ఏలు ప్రసన్న, రాజశేఖర్, వ్యవసాయ సిబ్బంది ధనలక్ష్మి, కిషోర్, ఏపీ సిఎన్‌ఎఫ్ సిబ్బంది శ్రీను, సుబ్బమ్మ, శ్రావణసంధ్య, యేరువారిపల్లి, గోసులవీడు రైతులు పాల్గొన్నారు.

వరిలో ఆకు చుట్టు పురుగు నివారణ

ప్రజాశక్మి-దొనకొండ

మండలంలో వరి సాగు చేస్తున్న రైతులు ఆకు చుట్టు పురుగును ఎలా నివారించాలనే దానిపై శుక్రవారం స్థానిక వ్యవసాయాధికారి ఎన్ లక్ష్మీ నారాయణ మండలంలోని రామాపురం, పడమర లక్ష్మీపురం గ్రామాల్లో తగు సూచనలు, సలహాలు ఇచ్చారు. ఈ సంవత్సరం అనుకున్న స్థాయి కంటే సాగర్ కాలువ ఎక్కువగా పారుదల ఉండటంతో మండలంలో సుమారు 600 ఎకరాలకు పైగా వరి పంట సాగు అయిందని ఆయన అన్నారు. ప్రస్తుతం వరి పైరులో ఆకు చుట్టు పురుగు ఆశించిందని, ఈ పురుగు రెండు ఆకుల చివరలో గూడు పెట్టుకుని పురుగు లోపల ఉంటూ పత్ర హరితాన్ని గీకి తినటం వలన ఆకులు తెల్లగా మారుతాయని తెలిపారు. దీనినే మజ్జిగ తెగులు, తెల్ల తెగులు అని పిలుస్తారన్నారు. దీన్ని నివారించకపోతే పంట దిగుబడిపై తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. పురుగు సోకిన పొలాల్లో క్లోరోఫైరిఫాస్ లీటర్ నీటికి 2 ఎంఎల్ లేదా క్లోరోనట్రా నిలిప్రోల్ 3 ఎంఎల్ లేదా కార్టాప్ హైడ్రో ఫ్లోరైడ్ 2గ్రా లేదా ఎసిఫేట్ 1.5 గ్రా చొప్పున 5 మిలీ వేపనూనెతో కలిపి పిచికారీ చేయటం వల్ల దీనిని నివారించవచ్చన్నారు. దీన్ని నివారించడానికి ఎకరాకు 25 కేజి పొటాష్ వాడాలి. ఎక్కువ మోతాదులో నత్రజని వాడటం వలన పురుగులు అధికంగా వస్తాయన్నారు. సూచించిన మోతాదులోనే పొటాష్‌తో కలిపి వాడితే తెగుళ్ల నివారించవచ్చన్నారు. రామాపురం సర్పంచ్ గొంగటి సుబ్బమ్మ, వ్యవసాయ సహాయకులు కృష్ణారెడ్డి, రైతులు పాల్గొన్నారు.

సైలెన్సర్లతో ఇబ్బంది పెడితే కఠిన చర్యలు

(మొదటిపేజీ తరువాయి)

అధిక శబ్దాన్నిచ్చే సైలన్సర్లతో ప్రయాణించే వాహనాలను ఉపేక్షించమన్నారు. బైక్ లకు విపరీత శబ్దాన్నిచ్చే సైలెన్సర్ అమర్చుకుని శబ్ద కాలుష్యం సష్టిస్తే చట్టపరమైన చర్యలు తీసుకోవడమే కాకుండా జరిమానా విధిస్తామన్నారు. వాహనాలకు మాడిఫైడ్ సైలెన్సర్లను విక్రయించే షాపుల యజమానులు, వాటిని బిగించే మెకానిక్ లపై కూడా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. భారీ శబ్దాలను చేస్తున్న వాహనాలతో గుండె జబ్బులు కలిగిన వారు, వద్ధులు భయపడుతున్న పరిస్థితులు ఎదురవుతున్నాయన్నారు. ప్రతి వాహనదారుడు ట్రాఫిక్ నిబంధనలు రోడ్డు భద్రత నియమాలను పాటించాలన్నారు. వాహనాలకు రణగొణ ధ్వనులు చేసే సైలెన్సర్ అమర్చుకొని ప్రజలకు, తోటి ప్రయాణికులకు అసౌకర్యం కలిగించకుండా బాధ్యతాయుతంగా ఉండాలని కోరారు. త్రిబుల్ రైడింగ్, డ్రైవింగ్ లైసెన్స్, నెంబర్ ప్లేట్స్ లేని వాహనాలు, ఓవర్ స్పీడ్, మాడిఫైడ్ సైలెన్సర్‌లు ఉన్న ద్విచక్ర వాహనాలపై చట్టపరమైన చర్యలు తీసుకుంటామన్నారు. వాహనాల నెంబర్ ప్లేట్లు ఎంవి యాక్ట్ నిబంధనల ప్రకారం ఉండాలని, వాహనదారులు డ్రైవింగ్ లైసెన్స్, రిజిస్ట్రేషన్, ఇన్సూరెన్స్, ఇతర ధృవపత్రాలు కలిగి ఉండాలన్నారు. జిల్లా ఎస్‌పి వెంట ఒంగోలు డిఎస్‌పి ఆర్ శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కెవి రాఘవేంద్ర, ఒంగోలు ట్రాఫిక్ సిఐ పాండు రంగారావు, ఒంగోలు తాలూకా సిఐ అజయ్ కుమార్, ఒంగోలు వన్ టౌన్ సిఐ నాగరాజు, సిబ్బంది ఉన్నారు.

ఒరిజినల్ దస్తావేజులు పోయినవి

బాపట్ల జిల్లా యద్దనపూడి మండలం అనంతవరం గ్రామానికి నివాసి పోపూరి జయమ్మ (జయలక్ష్మి) భర్త వెంకయ్యకు చెందిన ఒరిజినల్ దస్తావేజులు పోయినవి. సర్వే నంబరు 472/ఎ అనంతవరం నుండి యద్దనపూడి ఆటోలో వెళ్ళు చుండగా పోయినవి. ఎవరికైనా దొరికిన యడల ఈ క్రింది చిరునామాకు తెలియ పరచవలసిందిగా కోరుచున్నాను.

ఇట్లు
పోపూరి జయమ్మ (జయలక్ష్మి) , భర్త :వెంకయ్య,
అనంతవరం (గ్రామం & పోస్టు), యద్దనపూడి (మండలం), బాపట్ల (జిల్లా).
సెల్ : 9014016704

మహారాజశ్రీ ఫ్యామిలీ కం 8 వ అదనపు జిల్లా జడ్జి వారి కోర్టులో ఒంగోలు.

FCOP.No : 13/2023

Between
ఆలూరి నిర్మల ...పిటిషనర్
వర్సెస్
ఆలూరి వాసుబాబు ..రెస్పాండెంట్

To
ఆలూరి వాసుబాబు, తండ్రి బోసుబాబు,
R/o అప్పికట్ల గ్రామం, బాపట్ల మండలం,
బాపట్ల జిల్లా.

పై నెంబర్ గల కేసులో మీకు ఎన్ని పర్యాయములు పై కోర్టు ద్వారా నోటీసులు పంపిననూ ఉద్దేశ్యపూర్వకముగా తీసుకోనక కాలయాపన చేయుచున్నారు. కావున శ్రీ కోర్టు వారు మీ నోటీసు నిమిత్తం తేది 23-10-2024 నకు వాయిదా వేసి ఉన్నారు కావున మీరు ఆరోజు ఉదయం గం.10.30 నిమిషాలకు పై కోర్టు వారి ఎదుట మీరు స్వయంగా గాని లేదా వకీలు ద్వారా గాని పై కోర్టు వారి ఎదుట హాజరై మీకు గల అక్షేపణలు తెలియజేయవలసినది లేనియెడల మీపరోక్షముగా తీర్మానించబడునని ఇందుమూలముగా తెలియజేయడమైనది.

// కోర్టు వారి ఉత్తర్వుల మేరకు //

ఇట్లు
పైనీడి సుబ్బారావు
కర్నాటి వెంకటేశ్వరమ్మ
అడ్వకేట్స్, ఒంగోలు
సెల్ : 9618492955, 7396426680.

బహిరంగ ప్రకటన

ప్రకాశం జిల్లా, నాగులుప్పలపాడు మండలం, అమ్మనబ్రోలు గ్రామ కాపురస్తుడయిన ఈదర శ్రీనివాస రావు గారి కుమారుడు ఈదర జశ్వంత్ గారు మాకు ఇచ్చిన సంజాయిషీ మేరకు యావన్మంది ప్రజానీకానికి ఈ నోటీసు ద్వారా తెలియజేయునది ఏమనగా, ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని నా క్లయింటు తండ్రి గారైన ఈదర శ్రీనివాస రావు గారి పెద్దలచే సంపాదించబడి వారి అనంతరం నా క్లయింటు తండ్రి గారికి సంక్రమించబడి వారు నా క్లయింటు పేరిటికి ఒక సెటిల్‌మెంటు దస్తావేజు వ్రాయించి అమ్మనబ్రోలు సబ్‌రిజిష్టర్ ఆఫీసులో రిజిష్టర్ కాబడిన సెటిల్‌మెంట్ దస్తావేజు నెంబరు: 4945/2024 ద్వారా నా క్లయింటు కు సంక్రమించబడిన తదాది నాక్లయింటు సర్వసంపూర్ణ హక్కు బుక్తములు కలిగి యున్నారని మరియు దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిని "కెన్‌ఫిన్ హోమ్స్ ఫైనాన్స్" ఒంగోలు వారి వద్ద తనఖా ఉంచి ఋణము తీసుకొనుచున్నారు. కావున ఎవరికైనను సదరు ఆస్తి గురించి గాని, సదరు ఋణము గురించి గాని హక్కులు అభ్యంతరములు ఉన్న ఎడల లిఖిత పూర్వకముగా తగిన దస్తావేజులతో ఈ నోటీసు ప్రచురించబడిన "7" (ఏడు) దినముల లోపు ఈ క్రింది సంతకం దారుని సంప్రదించగలరు. లేనియెడల ఎవరికి ఏ విధమయిన అభ్యంతరములు గాని, హక్కులు గాని లేవని భావించి మా క్లయింటు ఈ దిగువ షెడ్యూలు దాఖలా ఆస్తిపై ఋణము తీసుకొనగలరు, గడువు తర్వాత వచ్చు అభ్యంతరములు మా క్లయింటును గాని, ఋణదాతను గాని భద్దపరచజాలవని యావన్మందికి తెలియజేయడ మైనది.

షెడ్యూలు: ప్రకాశం డిస్ట్రిక్టు ఒంగోలు రిజిస్ట్రేషన్ డిస్ట్రిక్టు అమ్మనబ్రోలు సబ్‌డిస్ట్రిక్టు యిలాకా, నాగులుప్పలపాడు మండలం, **అమ్మనబ్రోలు** గ్రామ పంచాయితిలో చేరిన **అమ్మనబ్రోలు** గ్రామ సర్వే నెం.669-1రులో డోరు నెం.3-99రు గల పెంకుటింటిని శిధిలం చేసిన తదుపరి ఖాళీ స్థలమునకు హద్దులు.

తూర్పు : బొడ్డు ఆంజనేయులు భార్య విమలమ్మ తాలూకు డాబా యిల్లు. **దక్షిణం** : చుంచు వెంకట రత్నమ్మ డాబా యిల్లు. **పడమర:** బజారు **ఉత్తరం:** ఈదర భీమయ్య కుమారుడు శ్రీనివాసరావు తాలూకు పెంకుటి యిల్లు. ఈ హద్దులలోనిది య0-02 సెంట్లు రెండు సెంట్లు లేక 96.8 చదరపు గజములు ఖాళీ స్థలం మాత్రం.

ఇట్లు... **చల్లా వెంకటప్పారెడ్డి,** న్యాయవాది
డోర్ నెం.46-139-63, 2వ లైన్, క్రిష్ణా నగర్,
వెంకటేశ్వరస్వామి గుడి దగ్గర, సమతా నగర్,
ఒంగోలు, ప్రకాశం జిల్లా. సెల్ : 9848044909

పశ్చిమ ప్రాంతంలో దంచి కొట్టిన వాన

- పొంగిన వాగులు
- నీటిలో చిక్కుకున్న స్కూల్ బస్సులు
- స్పందించిన స్థానికులు
- విద్యార్థులకు తప్పిన ప్రమాదం

ఉధృతంగా ప్రవహిస్తునన వాగు (తర్లుపాడు)

నీటిలో చిక్కుకున్న స్కూల్ బస్సులు (తర్లుపాడు)

ప్రజాశక్తి-తర్లుపాడు

తర్లుపాడు మండలంలో శుక్రవారం తెల్లవారుజామున రెండు గంటలపాటు భారీ వర్షం కురిసింది. దీంతో వాగులు వంకలు పొంగి ఉధతంగా ప్రవహిస్తున్నాయి.వంట

ఉధృతంగా ప్రవహిస్తున్న గుండ్లకమ్మనది (మార్కాపురం)

పొలాలు నీట మునిగాయి. తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్లే రహదారిలోని కొండవాగు, సీతానాగులవరం వాగు, తుమ్మల చెరువు వాగు ఉధృతంగా ప్రవహిస్తున్నాయి. తర్లుపాడు నుంచి మార్కాపురం వెళ్తున్న కారు వాగులో చిక్కుక్కు పోయింది. దాని వెనుకే వస్తున్న రెండు స్కూల్ బస్సులు కూడావాగు మధ్యలోనే నిలిచిపోయాయి. దీంతో బస్సుల్లోని విద్యార్థులంతా భయంతో పెద్దపెద్దగా కేకలు వేశారు. స్పందించిన స్థానికులు వాగులో చిక్కుకు పోయిన కారును బయటకు నెట్టారు. అనంతరం బస్సులను కూడా బయటకు తెచ్చారు. దీంతో ప్రమాదం తప్పింది. వాగు వద్ద అధికారుల పర్యవేక్షణ లేకపోవడంతో, బందోబస్తు ఏర్పాటు చేయడం వల్ల ఇలా జరిగిందని ప్రజలు ఆరోపించారు.

మార్కాపురం: మార్కాపురం పట్టణం, పరిసర ప్రాంతాల్లో శుక్రవారం తెల్లవారు జామున జోరు వాన కురిసింది. దీంతో పట్టణంలోని ప్రధాన రహదారులు నీటితో నిండుకున్నాయి. మార్కాపురం సమీపంలోని గుండ్లకమ్మనదిలోకి వరద నీరు చేరింది. వాగులకు, చెరువులకు నీరు చేరుతోంది.వారం రోజులుగా నిత్యం వర్షం కురవడంతో పత్తిపంట ఎందుకూ పనికి రాకుండా పోయిందని ఆ పంటను సాగు చేసిన రైతులు ఆందోళన చెందుతున్నారు. మిరప పంట కూడా అధిక వర్షం కారణంగా ఉరకలెత్తుతోందని రైతులు వాపోతున్నారు.



అష్రాఫ్‌ను అభినందిస్తున్న ప్రిన్సిపల్

అష్రాఫ్‌కు కాంస్య పతకం

ప్రజాశక్తి - శింగరాయకొండ: పాండిచ్చేరిలోని రాజీవ్ గాంధీ ఇంటర్నేషనల్ స్టేడియంలో నిర్వహించిన థర్డ్ ఫ్లోర్ కర్లింగ్ నేషనల్ ఛాంపియన్ షిప్-2024 లో శింగరాయకొండలోని శ్రీచైతన్య టెక్నో స్కూల్‌లో ఐదో తరగతి చదువుతున్న అష్రాఫ్ కాంస్య పతకం సాధించాడు. కాంస్య పతకం సాధించిన అష్రాఫ్‌ను స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మణ్ సూర్యరావు, ఉపాధ్యాయులు అభినందించారు, అష్రాఫ్‌ను తీర్చిదిద్దిన కోచ్ జాషువాను కలెక్టర్ తమీమ్ అన్సారియా, శ్రీ చైతన్య టెక్నో స్కూల్ ప్రిన్సిపల్ లక్ష్మణ్ సూర్యరావు అభినందించారు.

హామీలు అమలు చేయాలి

ప్రజాశక్తి-యర్రగొండపాలెం

కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలను అమలు చేయాలని యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ డిమాండ్ చేశారు. స్థానిక కార్యాలయంలో వైసిపి కార్యకర్తలతో శుక్రవారం సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గ్రామాల్లోని సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ ఎన్నికల సమయంలో ఇచ్చిన ఏడాదికి మూడు ఉచిత సిలిండర్లు, అమ్మ ఒడి, ఉచిత బస్సు ప్రయాణం పథకాల ఊసే లేదన్నారు.ఈ కార్యక్ర మంలో వైసిపి మండల కన్వీనర్ కొప్పర్తి ఓబుల్‌రెడ్డి, సర్పంచులు ముసలారెడ్డి, సుబ్బారెడ్డి, వెంకటేశ్వరరెడ్డి, మాజీ సర్పంచి దండా బాదర్‌రెడ్డి, వలి, పోలిరెడ్డి పాల్గొన్నారు.

బాల్యవివాహాలు నిర్వహిస్తే చర్యలు

ప్రజాశక్తి -శింగరాయకొండ

బాల్య వివాహాలు నిర్వహిస్తే కఠిన చర్యలు తప్పవని శింగరాయకొండ సిఐ హజరత్తయ్య తెలిపాడు. బాల్య వివాహాల నిరోధక దినోత్సవం సందర్భంగా సాంత్వనా సేవా సమితి ఆధ్వర్యంలో శుక్రవారం ప్రత్యేక కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా సిఐ మాట్లాడుతూ బాల్య వివాహాలు చేయడం వల్ల ఆడపిల్లల జీవితంపై దారుణమైన ప్రభావం ఉంటుందని తెలిపారు.ఈ కార్యక్రమంలో సంస్థ డైరెక్టర్ జయకుమార్ ఐసిడిఎస్ సూపర్ వైజర్ రిజ్వానా, పోలీస్ సిబ్బంది, మహిళా పోసులు పాల్గొన్నారు.

పంటల సాగుపై రైతులకు శిక్షణ

రైతులకు కర దీపికలు అందజేస్తున్న అధికారులు

ప్రజాశక్తి- చీమకుర్తి

పంటల్లో మేలైన యాజమాన్య పద్ధతులు పాటించడం ద్వారా అధిక దిగుబడులు సాధించవచ్చునని జిల్లా వనరుల కేంద్రం వ్యవసాయ శాఖ అధికారి వీరగంధం వెంకట శేషమ్మ తెలిపారు. చీమకుర్తి మండలం కూనంనేనివారి పాలెం గ్రామంలో జిల్లా వనరుల కేంద్రం ఒంగోలు వారి ఆధ్వర్యంలో ఆర్‌కెవివై ఆర్ఎఫ్‌ఎఎఆర్ పథకం 2024-25 క్రింద రైతు సేవా కేంద్రం పరిధిలో రైతులకు వ్యవసాయం, ఉద్యాన పంటలలో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతులపై శిక్షణా కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా శేషమ్మ మాట్లాడుతూ వరి, కంది, శనగ, మినుము, పొగాకు పంటలలో చేపట్టాల్సిన మేలైన యాజమాన్య పద్ధతుల గురించి వివరించారు. వరి నేరుగా విత్తే పద్ధతి, జీవన ఎరువులు, జీవ శిలీంధ్ర నాశినుల గురించి రైతులకు అవగాహన కల్పించారు.చీమకుర్తి ఎ. డివి. భాస్కర్ మాట్లాడుతూ వ్యవసాయ శాఖ ద్వారా అమలు చేస్తున్న పథకాలు, ఈ క్రాప్ నమోదు ప్రాముఖ్యత గురించి వివరించారు. అనంతరం వివిధ పంటలలో సమగ్ర యాజమాన్య పద్ధతుల సంబంధించిన శిక్షణా కరదీపికను రైతులకు అందజేశారు.ఈ కార్యక్రమంలో ఎఇ. పి.వెంకటేశ్వర్లు, విఎఎ బి. రంగ దివ్య, రైతులు తదితరులు పాల్గొన్నారు

సమావేశానికి హాజరుకాని

అధికారులకు మెమోలు ఇవ్వాలి : ఎంపిపి

సమావేశంలో మాట్లాడుతున్న అధికారి

ప్రజాశక్తి- కొత్తపట్నం

మండల పరిషత్ సర్వసభ్య సమావేశానికి గైర్హాజరైన అధికారులకు మెమో ఇచ్చి జీతాలు ఆపాలని ఎంపిపి అధ్యక్షులు లంకపోతు అంజిరెడ్డి కోరారు. ఎంపిపి అధ్యక్షతన మండల సర్వసభ్య సమావేశం శుక్రవారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఎంపిపి మాట్లాడుతూ మండల పరిషత్ తీర్మానం లేకుండా మండలంలో 15 పంచాయతీలు ఉండగా కేవలం ఏడు పంచాయతీల్లోనే ఉపాధి పనులు పట్టతీవ్ర అభ్యంతరం వ్యక్తం చేశారు. దీ 15 పంచాయతీలలో పనులు నిర్వహించాలని మండల సమావేశంలో ఏకగ్రీవంగా తీర్మానించారు. ఎంపిటిసి రామలింగం వెంకటరావు మాట్లాడుతూ ప్రభుత్వ వైద్యశాల అధికారులు పూలదండలు, శాలువాలకు బిల్లు పెట్టడంపై అభ్యంతరం వ్యక్తం చేశారు. అందుకు స్పందించిన డాక్టర్ వైష్ణవి పూలదండలు, శాలువాలకు తాము బిల్లు పెట్టలేదని, నిరూపిస్తే ఉద్యోగం మానుకుంటానని సవాల్ చేశారు. ఈ కార్యక్రమంలో ఎఎ నాంచార్లు రెడ్డి, ఎంపిడిఒ శ్రీకృష్ణ, ఎంపిటిసిలు, సర్పంచులు ,మండల అధికారులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఉపాధ్యాయురాలు మృతి

మృతిచెందిన ధనలక్ష్మి

ప్రజాశక్తి- అద్దంకి

బైకుఅదుపు తప్పి బోల్తా కొట్టిన ఘటనలో ఓ ఉపాధ్యా యురాలు మృతి చెందింది. ఈ ఘటన పలనాడు జిల్లా వినుకొండ మండలం నాగులవరం గ్రామ సమీపంలో శుక్రవారం సాయంత్రం చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. అద్దంకి పట్టణంలోని అభ్యుదయనగర్‌లో నివాస ముంటున్న మునగాల ధనలక్ష్మి (41) పలనాడు జిల్లా వినుకొండ మండలం గోకనకొండ గ్రామంలోని ప్రభుత్వ పాఠశాలలో ఉపాధ్యాయురాలిగా పనిచేస్తుంది. రోజులాగే పాఠశాలకు వెళ్లి విధులు ముగించుకొని తోటి ఉపాధ్యాయుల బైకు ఇంటికి వస్తుంది. ఈ క్రమంలో ఘటన స్థలం వద్ద వచ్చేసరికి ఆర్‌టిసి బస్సు వచ్చింది. బస్సు సైడ్ ఇచ్చే క్రమంలో బైకు రోడ్డు మార్జిన్‌లో దిగి అదుపు తప్పి బోల్తాకొట్టింది. దీంతో ధనలక్ష్మి అక్కడికక్కడే మృతి చెందింది.

దొంగలను తరిమికొట్టిన గ్రామస్తులు

ప్రజాశక్తి- కొమరోలు :

గుడిలో చోరీకి యత్నించిన గ్రామస్తులు తరిమికొట్టారు. ఈ ఘటన మండల పరిధిలోని తంబళ్లపల్లె క్రాస్ రోడ్డు గ్రామ సాయిబాబా గుడి వద్ద గురువారం అర్ధరాత్రి చోటు చేసుకుంది. అందిన వివరాల ప్రకారం.. గుర్తుతెలియని వ్యక్తులు గుడిలో చోరీకి యత్నించారు. ఈ విషయాన్ని సిసి కెమెరాల ద్వారా గమనించి ఆలయ నిర్వాహకులు, గ్రామస్తులు గుడివద్దకు చేరుకొని దొంగలను వెంబడించారు. దీంతో వారు అక్కడి నుంచి పరారీ అయ్యారు. తమతో తెచ్చుకున్న బైక్ అక్కడే వదిలేసిన దొంగలు పరారీ అయ్యారు. నెల రోజుల వ్యవధిలో దేవాలయంలో దొంగలు మూడో చోరీకి యత్నించినట్లు ఆలయ నిర్వాహకులు తెలిపారు. ఈ ఘటనపై పోలీసులకు ఫిర్యాదు చేయడంతో ఎస్ఐ వెంకటేశ్వర్లు నాయక్ తమ సిబ్బందితో కలిసి ఘటనా స్థలాన్ని పరిశీలించారు. సిసి పుటేజీని పరిశీలించి కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నారు. త్వరలోనే నిందితులను పట్టుకుంటామని ఈ సందర్భంగా ఎస్ఐ తెలిపారు.

ఇద్దరికి గాయాలు

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

లారీలు ఎదురెదురుగా ఢీకొన్న ఘటనలో ఇద్దరు డ్రైవర్లకు స్వల్పగాయాలయ్యాయి. ఈ ఘటన మండల పరిధిలోని మొట్ల మల్లికార్జునపురం సమీపంలోని నల్లమల ఘాట్ రోడ్డు వద్ద శుక్రవారం చోటుచేసుకుంది. కలకత్తా నుంచి బళ్లారి వెళుతున్న లారీ, కర్నూల్ నుంచి శ్రీశైలం వెళ్తున్న లారీ ఎదురెదురుగా ఢీకొన్నాయి. దీంతో ఇద్దరు డ్రైవర్లకు గాయాలయ్యాయి. ఘాట్ రోడ్డుపై భారీగా ట్రాఫిక్ నిలిచిపోయింది. క్షతగాత్రులను పెద్ద దోర్నాల వైద్యశాలకు తరలించారు.

వధూవరులను ఆశీర్వదిస్తున్న ఎమ్మెల్యే చంద్రశేఖర్

వివాహ వేడుకల్లో ఎమ్మెల్యే

ప్రజాశక్తి-పెద్దదోర్నాల

దోర్నాలలోని బొగ్గరపువారి కళ్యాణ మండపంలో పల్లా మల్లికార్జున కుమారుడి వివాహ వేడుకలు శుక్రవారం నిర్వహించారు. ఈ వేడుకల్లో యర్రగొండపాలెం ఎమ్మెల్యే తాటిపర్తి చంద్రశేఖర్ పాల్గొని నూతన వధువరులను ఆశీర్వదించారు. ఈ కార్యక్రమంలో సర్పంచి చిత్తూరి హారిక, నాయకులు గంటా వెంకట రమణారెడ్డి, గుమ్మా యల్లేష్ యాదవ్, వెంకటేశ్వర్లురెడ్డి, గురవారెడ్డి, లాలు నాయక్, రమణయ్య, రమేష్, శేఖర్‌రెడ్డి పాల్గొన్నారు.

ఆర్థిక సహాయం అందిస్తున్న ఆర్గనైజేషన్ ప్రతినిధులు

బాలిక వైద్యానికి 'ఫ్రెండ్స్' ఆర్థిక సాయం

ప్రజాశక్తి - బాపట్ల

పుట్టుకతోనే ఒకకంటి చూపుతో ఇబ్బంది పడుతున్న బాలికకు బాపట్ల ఫ్రెండ్స్ ఆదర్శ యూత్ ఆర్గనైజషన్ సభ్యులు శుక్రవారం ఆర్థిక సహాయం చేశారు. మండలంలోని పాండురంగపురంకు చెందిన 2వ తరగతి విద్యార్థి మౌనిత ఒక కంటిచూపుతో ఇబ్బంది బడుతుంది. పేదరికంతో ఉన్న బాలికకు మధురై కంటి ఆసుపత్రిలో రెండో కంటిని పరీక్షించి అవసరమైతే గాజు కన్ను అమర్చేందుకు అవసరమైన ఖర్చుల్లో కొంతమేర ఆర్థిక సహాయాన్ని అందించినట్లు ఆర్గనైజేషన్ అధ్యక్షులు బండ్రెడ్డి గోపి తెలిపారు. బాలిక కంటి వైద్యానికి దాతలు, స్వచ్ఛంద సంస్థలు సహకారం అందించి దుకోవాలని కోరారు. కార్యక్రమంలో గౌరవ అధ్యక్షులు వేజండ్ల శ్రీనివాసరావు, కోశాధికారి జోగి సువర్ణరాజు, విన్నకోట శ్రీనివాసరావు, యాసం రాజా రమేష్, బండి శ్రీనివాసరావు, కందుల శ్రీకాంత్, చెల్లి అశోక్ కుమార్ పాల్గొన్నారు.

అబ్దుల్ కలాం అవార్డుకు ఎంపిక

ప్రజాశక్తి - బాపట్ల

రియాజ్ అహ్మద్

మండలంలోని చందోలుకు చెందిన ఎండి రియాజ్ అహ్మద్ డాక్టర్ ఎపిజె అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డు ఎంపికైనట్లు దక్షిణాది ప్రైవేటు లెక్చరర్, టీచర్ల సంస్థ శుక్రవారం ప్రకటించింది. సంస్థ ప్రతి ఏటా నిర్వహించే ఎపిజె అబ్దుల్ కలాం జాతీయ ప్రతిభ అవార్డు అందజేస్తుంది. చరిత్ర గల చందోలు గ్రామానికి చెందిన ఎండి రియాజ్ అహ్మద్ రెండున్నర దశాబ్దాలుగా ఇండియన్ బ్లూమ్స్ విద్యా సంస్థను స్థాపించి ఎంతో మంది సాధారణ విద్యార్థులను అసాధారణ రీతిలో తీర్చిదిద్ది, భవితకు బంగారు బాటలు వేశారని పేర్కొన్నారు. ప్రధానంగా పేద, మధ్య తరగతి విద్యార్థులను ప్రత్యేక విద్యా బోధనతో వివిధ రంగాల్లో ఉన్నత ఉద్యోగ ఉపాధి అవకాశాల పట్ల ప్రోత్సహించారని అన్నారు. అనాథ పిల్లలను ప్రోత్సహించి ఉచిత విద్య అందించి జీవితంలో స్థిరపడే విధంగా ప్రత్యేక చర్యలు చేపట్టారని అన్నారు. ఈ నెల 20న ఆచార్య నాగార్జున విశ్వవిద్యాలయంలో దక్షిణాది ప్రైవేట్ లెక్చరర్స్, టీచర్స్ సంస్థ నిర్వహించే కార్యక్రమంలో ఆయనకు అవార్డును ప్రదానం చేయనున్నట్లు తెలిపారు.

బాల్యవివాహాలపై అవగాహన కల్పిస్తున్న ఐసిడిఎస్ సుధ

బాల్య వివాహాలు అరికట్టాలి

ప్రజాశక్తి - బల్లికురవ

బాల్య వివాహాలు అరికట్టేందుకు మండల స్థాయి కమిటీ సమావేశం స్థానిక ఎంపిడిఒ కార్యాలయంలో శుక్రవారం నిర్వహించారు. ఈసందర్భంగా సిడిపిఒ సుధ మాట్లాడుతూ రెవెన్యూ, గ్రామ కార్యదర్శి, వైద్య సిబ్బందితో బృంధంగా బాల్య వివాహాలు అరికట్టేందుకు చర్యలు చేపట్టాలని కోరారు. గ్రామ స్థాయిలో కూడా ఐసిడిఎస్ ఆధ్వర్యంలో అంగనవాడీ కార్యకర్తలతోపాటు టీంగా చైతన్యం చేయాలని సూచించారు. గ్రామాల్లో బాలికల తల్లిదండ్రులకు అవగాహన కల్పించాలని చెప్పారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కుసుమకుమారి, తహశీల్దారు రవికుమార్, ఎంఇఒ వస్రంనాయక్ పాల్గొన్నారు.

అధికారులు సమన్వయంతో పనిచేయాలి

పల్లె పండుగలో మంత్రి గొట్టిపాటి రవికుమార్

ప్రజాశక్తి - బల్లికురవ

పల్లె పండుగ కార్యక్రమంలో భాగంగా మంత్రి గొట్టిపాటి రవికుమార్ రూ.30లక్షల నిధులతో నిర్మించనున్న సిసి రోడ్లకు మండలంలోని పెద అంబడిపూడిలో శుక్రవారం శంకుస్థాపన చేశారు. గ్రామ ప్రజల సమస్యలు తెలుసుకునేందుకు గ్రామంలో పర్యటించారు. ప్రజలు ఇబ్బందులు పడకుండా సమస్యలు పరిష్కరించేందుకు అధికారులు చొరవ చూపాలని సూచించారు. ఇటీవల విద్యుత్ షాక్‌తో గేదె చనిపోయిన రైతుకు వెంటనే నష్ట పరిహారం చెల్లించాలని విద్యుత్ అధికారులను ఆదేశించారు. తక్షణం పరిష్కరించే సమస్యలపై అర్జీలకు అధికారులు స్పందించి త్వరితగతిన పరిష్కారం చూపాలని కోరారు. కార్యక్రమంలో ఎంపిడిఒ కుసుమకుమారి, తహశీల్దారు రవికుమార్, సర్పంచి కుసుమకుమారి, మాజీ సర్పంచి మందలపు సుధాకర్, నాయకులు గోవిందరావు, ఎస్ఐ జివి చౌదరి పాల్గొన్నారు.

నగరం : పల్లె పండగలో సిసి రోడ్డు నిర్మాణానికి మంత్రి అనగాని సత్యప్రసాద్ సోదరుడు అనగాని శివప్రసాద్ శుక్రవారం శంకుస్థాపన చేశారు. నగరంలో రూ.30 లక్షలు, ఈదుపల్లిలో రూ.20లక్షలు, మీసాలవారిపాలెంలో రూ.15 లక్షలు, గాలివారిపాలెంలో రూ.10లక్షలు, పూడివాడలో రూ.20లక్షలతో రోడ్లు నిర్మాణం చేస్తున్నట్లు తెలిపారు. నిర్మాణం పూర్తి చేసి రోడ్లు ప్రారంభిస్తామని తెలిపారు. కార్యక్రమంలో తహశీల్దారు నాంచారయ్య, ఎండిఓ శ్రీనివాస్, మత్తి భాస్కర్, మేకా శివరామకృష్ణ, ఉదయకృష్ణ గోపరాజు, లుక్కా గుడారంకయ్య, పిన్నిబోయిన చింతారావు, సమ్మెట చెన్నకేశవులు పాల్గొన్నారు.

భట్టిప్రోలు : పల్లె పండుగలో భాగంగా మండలంలోని పెద్దపులివర్రు, వెల్లటూరు, ఓలేరు, పెదలంక, చింతమోటు గ్రామాల్లో అభివృద్ధి పనులకు ఎంపిపి డివి లలితకుమారి, జడ్పిటిసి టి ఉదయ భాస్కరి శుక్రవారం శంకుస్థాపన చేశారు. పోలేరులో రూ.25లక్షలు, చింతమోటులో రూ.20 లక్షలు, పెదపూలివర్రులో రూ.20లక్షలతో సిసి రోడ్ల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. పెదలంకలో రు.2.30 లక్షలతో క్యాటిల్ షెడ్ నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. ఈ సందర్భంగా ఎంపిపి లలితకుమారి మాట్లాడుతూ ఎంజిఎన్ఆర్ఇజిఎస్ ఉపాధి హామీ పథకం ద్వారా చేపట్టిన పల్లె పండుగ పనులను త్వరత గతిన పూర్తి చేయాలని కోరారు. ఎంపిడిఒ ఎస్వి రమణ, ఎపిఒ శివ పార్వతి, ఈఒ పిఆర్డి ఊహారాణి, టిఎ సుధీర్, ఓలేరు సర్పంచ్ మెరుగ రంగారావు, ఎంపిటిసి నీల సాంబమ్మ, పెదలంక, చింతమోటు సర్పంచ్‌లు వేములపల్లి రంజిత, గుమ్మడి శంకర్రావు, పెద్ద పులివర్రు సర్పంచ్ నీలా ఉషా రాణి రమేష్, వెల్లటూరు సర్పంచ్ బొజ్జ రవి, ఎంపిటిసిలు వాకా వెంకటనారాయణ, నన్నెపాముల చంటి పాల్గొన్నారు.

పర్చూరు : మండలంలో పల్లె పండుగను నూతలపాడు, నాగులపాలెం, రమణయ్య పాలెం, చింతగుంటపాలెంలో నిర్వహించారు. సిసి రోడ్లు, గ్రావెల్ రోడ్లకు శంకుస్థాపన చేశారు. ఎంపిడిఒ ప్రద్యుమ్న కుమార్ మాట్లాడుతూ గ్రామాల్లో లక్షల నిధులతో అభివృద్ధి పనులు చేపడుతున్నట్లు తెలిపారు. రూ.45లక్షలతో ఎనిమిది సిసి రోడ్లకు శంకుస్థాపన చేశారు. రమణాయపాలెంలో రూ.2లక్షలు, చింతగుంటపాలెంలో రూ.3.52లక్షలతో రోడ్డు నిర్మాణం చేయనున్నట్లు తెలిపారు. రూ.1.30కోట్ల నిధులతో పర్చూరు, ఉప్పుటూరు, బోడవాడ, కొల్లవారిపాలెం, తూర్పు పెద్దివారిపాలెం గ్రామాల్లో సీసీ రోడ్ల నిర్మాణానికి శుక్రవారం శంకుస్థాపన చేసినట్లు ఎంపిడిఒ ప్రద్యుమ్న కుమార్ తెలిపారు. ప్రణాళికా బద్ధంగా నిర్దిష్ట కాలంలో పనులు పూర్తి చేయనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో ఎపిఒ బుచ్చిబాబు, ఎంఎఇ శ్రీనివాసరావు, ఈఒఆర్డి సత్యనారాయణ, నాయకులు షేక్ శంషుద్దిన్, పెదపూడి విజయ్ కుమార్, కె సందీప్ తేజ, అడితి బ్రహ్మం, కఠారి సురేంద్ర, మామిడిపాక హరిప్రసాద్, ఎవి కృష్ణారావు, ఎంపిటిసి అడపా వెంకటరెడ్డి, సర్పంచులు చిన్నయ్య, ఉషారాణి, ఎపిఒ బుల్లయ్య, టిడిపి నాయకులు కొల్లా సుభాష్ బాబు, విన్నకోట సతీష్, ఎస్‌కె సంశుద్ధిన్ పాల్గొన్నారు.

కారంచేడు : మండలంలోని స్వర్ణపాలెంలో రూ.10లక్షలు, కేశవరపాడులో రూ.15లక్షలు, కొడవలి వారిపాలెంలో రూ.16లక్షలు, నాయుడువారిపాలెంలో రూ.20లక్షలతో సిసి రోడ్లు, డ్రైనేజీల నిర్మాణానికి శంకుస్థాపన చేశారు. కార్యక్రమంలో పంచాయతీరాజ్ ఎఇ కె దాసు, తెలుగుదేశం నాయకులు తిరుమల శెట్టి శ్రీహరి, కొసరాజు సురేంద్రబాబు, నాయుడు హనుమంతరావు, ఖాసిం, సర్పంచులు నాయుడు సీతారామ, సీతామహాలక్ష్మి, కొడాలి మోహనకృష్ణ, వెలుగు ధనలక్ష్మి పాల్గొన్నారు.

రోడ్లకు శంకుస్థాపన చేస్తున్న మంత్రి గొట్టిపాటి రవికుమార్

సిసి రోడ్ల శంకుస్థాపన చేస్తున్న అనగాని శివప్రసాద్

భూమి పూజ చేస్తున్న భట్టిప్రోలు ఎంపిపి, జడ్పిటిసి

శంకుస్థాపన చేస్తున్న పర్చూరు ఎంపిడిఒ ప్రద్యుమ్నకుమార్

విద్యుత్ సర్దుబాటు ఛార్జీలు రద్దు చేయాలి

ప్రజాశక్తి - ముండ్లమూరు

పెంచిన విద్యుత్ ధరలకు వ్యతిరేకంగా స్థానిక సబ్‌స్టేషన్ వద్ద శుక్రవారం ధర్నా నిర్వహించారు. సిపిఎం మండల కార్యదర్శి వెల్లంపల్లి ఆంజనేయులు మాట్లాడుతూ నిత్యవసర వస్తువుల ధరలు నింగిని అంటుతున్నాయి. మరోవైపు కరువు వరదలు, వ్యాధులు వెంటాడుతున్నాయి. ఈ స్థితిలో ప్రజలకు ఉపశమనం కలిగించకపోగా గత ప్రభుత్వ పద్ధతిలోనే విద్యుత్ సర్దుబాటు చార్జీల పేరిట 2022 - 23 సంవత్సరాని సంబంధించి రూ.8113 కోట్ల భారం మోపుతున్నారు. 2023 - 24 సంవత్సరంకు సంబంధించి మరో రూ.11వేల కోట్లకుపైగా సర్దుబాటు చార్జీలను సిద్ధం చేస్తున్నారు. రూ.20వేల కోట్ల భారాలు వేయడానికి సిద్ధపడుతున్నారు. ఈ సర్దుబాటు చార్జీలను ఉపసంహరించాలని ప్రభుత్వంపై ఒత్తిడి తెచ్చేందుకు జరుగుతున్న నిరసన కార్యక్రమంలో పాల్గొన్న ప్రజలకు సిపిఎం అభినందనలు తెలుపు తుందని అన్నారు. 2000 సంవత్సరంలో వామపక్షాల వీరోచితంగా పోరాడి ముగ్గురు కార్యకర్తలు వీర మరణం పొందారని అన్నారు. నాటి ప్రజాగ్రహానికి తలవంచిన పాలకులు తర్వాత కాలంలో విద్యుత్ చార్జీలను పెంచేందుకు సాహసించలేదు. మోడీ ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కార్పొరేట్ శక్తులకు ఊడిగం చేస్తుందని అన్నారు. అనంతరం ఎడికి వినతి పత్రం అందజేశారు. కార్యక్రమంలో హనుమంతరావు, సత్యం, రమేష్, ఎర్రయ్య పాల్గొన్నారు.

ధర్నా నిర్వహిస్తున్న సిపిఎం నాయకులు, కార్యకర్తలు

నేడు పట్టణంలో నీటి సరఫరా నిలిపివేత

ప్రజాశక్తి - బాపట్ల

మంచినీరు సరఫరా అయ్యే పైపులైన్లు లీకుల మరమ్మత్తులు నిర్వహించేందుకు పట్టణంలో నేడు నీటి సరఫరా నిలిపివేస్తున్నట్లు కమిషనర్ జి రఘునాథరెడ్డి తెలిపారు. తాగునీటి సరఫరా పైపుల లీకేజీలను అరికట్టడంతోపాటు ఇతర లోపాలు సరిదిద్దేందుకు ప్రజలు సహకరించాలని కోరారు. మరమ్మత్తులు పూర్తయిన వెంటనే సురక్షితమైన మంచినీటి సరఫరా చేయనున్నట్లు తెలిపారు.

నీటి శుద్ధి ప్లాంటును పరిశీలిస్తున్న కమిషనర్

జాతీయ రజిత పతకం అందుకుంటున్న యజ్ఞ ప్రసాద్

పవర్ లిఫ్టింగ్‌లో జాతీయ స్థాయి పతకం

ప్రజాశక్తి - చీరాల

పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా కార్యదర్శి అన్నదాత యజ్ఞప్రసాద్ జాతీయ స్థాయి బెంచ్ ప్రెస్ పోటీల్లో 157.5 కేజీల బరువు ఎత్తి రజిత పతకం సాధించారు. పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ జిల్లా అధ్యక్షులు, కామాక్షి కేర్ మల్టీ స్పెషాలిటీ హాస్పిటల్ ఎండి డాక్టర్ తాడివలస దేవరాజు విజేతకు అభినందనలు తెలిపారు. ఈ నెల 14 నుండి 18 వరకు గోవా రాష్ట్రం వాస్కోలోని రవీంద్ర భవన్లో పవర్ లిఫ్టింగ్ ఇండియా ఆధ్వర్యంలో 33వ జాతీయ స్థాయి సబ్ జూనియర్, జూనియర్, సీనియర్, మాస్టర్స్, మహిళలు, పురుషుల క్లాసిక్ అండ్ ఎక్యూప్డ్ పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్షిప్ నిర్వహించారు. 5రోజులపాటు జరిగిన పోటీల్లో చీరాల ప్రాంతానికి చెందిన అన్నదాత యజ్ఞ ప్రసాద్ మాస్టర్స్-2 విభాగంలో పురుషుల 93కిలోల కేటగిరీలో ఆంధ్రప్రదేశ్ తరపున పోటీపడి 157.5 కేజీల బరువును ఎత్తి రెండో స్థానంలో నిలిచి జాతీయ స్థాయి రజిత పతకం సాదించారని తెలిపారు. చీరాల పేరుని జాతీయ స్థాయిలో నిలబెట్టిన ఎవై ప్రసాద్‌కు అసోసియేషన్ వైస్ చైర్మన్ పర్చూరు కుమారి నంద, అధ్యక్షులు చిన్న, అంబేశ్వరరెడ్డి, నాగేశ్వరరావు అభినందనలు తెలిపారు.

భూసేకరణ పనులు త్వరగా పూర్తి చేయండి

అధికారులకు జేసీ గోపాలకృష్ణ ఆదేశం

మాట్లాడుతున్న జేసీ గోపాలకృష్ణ

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలో నుంచి వెళుతున్న జాతీయ రహదారులు. ప్రతిపాదిత రైల్వే మార్గాలకు పెండింగ్ భూసేకరణ పనులను త్వరగా పూర్తి చేయాలని సంయుక్త కలెక్టర్ ఆర్.గోపాలకష్ణ అధికారులను ఆదేశించారు. ఈ పనులకు సంబంధించిన అధికారులతో శుక్రవారం ఆయన ప్రకాశం భవనంలో ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. నడికుడి 565, 544(4), 216, 765, 167(బి) శ్రీకాళహస్తి రైల్వే మార్గంతో పాటు పెండింగ్ భూ సేకరణ పనుల వివరాలను జెసి అధికారులను అడిగి తెలుసుకున్నారు. పునరావాసం, పెండింగ్‌లోని నష్టపరిహారం. కోర్టు కేసులపై ప్రత్యేక దృష్టి పెట్టి పరిష్కరించాలని ఆయన దిశా నిర్దేశం చేశారు. సమావేశంలో మార్కాపురం సబ్ కలెక్టర్ సహదిత్ వెంకట త్రివినాగ్, కందుకూరు సబ్ కలెక్టరు శ్రీపూజ, కనిగిరి ఆర్డీవో జి.కేశవర్ధన్ రెడ్డి, ఒంగోలు ఆర్డీవో కె. లక్ష్మి ప్రసన్న. జాతీయ రహదారులు, రైల్వే శాఖ అధికారులు. సంబంధిత మండలాల తహాశీల్దార్లు పాల్గొన్నారు.

వికాస్ హాస్పిటల్స్ ఆధ్వర్యంలో

'వెంకట రమణ'లో వాస్క్యులర్ సర్జరీ సేవలు

సిఇఒ నరసింహమూర్తి సాతులూరి

మాట్లాడుతున్న సిఇఒ నరసింహమూర్తి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలులోని వెంకటరమణ హాస్పిటల్‌లో గుంటూరు వికాస్ హాస్పిటల్స్ వారితో వాస్క్యులర్ సర్జరీ సేవలు అందుబాటులోకి తెచ్చినట్లు వికాస్ హాస్పిటల్స్ సిఇఒ నరసింహమూర్తి సాతులూరి తెలిపారు. డాక్టర్ ఎన్‌టిఆర్ వైద్య సేవ ద్వారా వాస్క్యులర్ సేవలు వెరికోస్ వెయిన్స్, ఎవి.ఫిస్టులా, డయాబెటిక్ ఫుట్ అల్సర్, ఎండో వాస్క్యులర్ చేస్తున్నామన్నారు. ఇంతకుముందు ప్రకాశం జిల్లాలో దాదాపు 7 సంవత్సరాలు పనిచేసిన అనుభవంతో వాస్క్యులర్ సర్జరీ సేవలు ఇక్కడ ప్రజలకు అందించాలనే ఉద్దేశంతో వెంకటరమణ హాస్పిటల్ యం.డి డాక్టర్ సీతారామయ్యని, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరిని సంప్రదించగా సానుకూలంగా స్పందించారని చెప్పారు. వెంకట రమణ హాస్పిటల్స్‌లో ఈ వాస్క్యులర్ సేవలు ప్రతి నెలా మొదటి మరియు మూడో శుక్రవారం అందుబాటులో ఉంటాయని,ఈ సేవలను వినియోగించుకోవాలని డాక్టర్ సీతారామయ్య తెలిపారు. కార్యక్రమంలో డాక్టర్ సురేంద్ర నాగులపాటి, డాక్టర్ చంద్రశేఖర్, డాక్టర్ సుబ్రహ్మణ్యేశ్వరి పాల్గొన్నారు.

వికలాంగ వధూవరులను ఆశీర్వదిస్తున్న పెళ్లి పెద్దలు

వైభవంగా వికలాంగ జంటలకు వివాహం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

సూర్యశ్రీ దివ్యాంగుల చారిటబుల్ ట్రస్ట్ నిర్వాహకులు షేక్ సర్దార్‌బాషా-షహనాజ్ దంపతుల వద్ద ఆశ్రమం పొందుతున్న ఐదుగురు వికలాంగ జంటలకు శుక్రవారం ఒంగోలు ఎన్టీఆర్ కళాక్షేత్రంలో పెద్దల సమక్షంలో ఘనంగా వివాహం చేశారు. ప్రవాస భారతీయులు వంకాయలపాటి సాంబశివ రావు-కవిత దంపతుల కుమార్తె వర్షిత జన్మ దినోత్సవం సందర్భంగా కొమ్మి రమణయ్య-రాజేశ్వరి దంపతుల ఆధ్వర్యంలో ఈ వివాహం జరిగింది. కార్యక్రమంలో పారిశ్రామికవేత్త మండవ మురళీకష్ణ-సవిత, మారెళ్ళ సుబ్బారావు-రాజేశ్వరి దంపతులు తదితర పెద్దలు హాజరై నూతన వధూవరులను ఆశీర్వదించారు. ఈ సందర్భంగా హెల్పింగ్ హాండ్స్ ప్రత్యేక డాక్యుమెంటరీని ప్రదర్శించారు. వర్షిత పుట్టినరోజు పురస్కరించుకొని నగరంలోని 300 మంది పేదలకు భోజన వసతి ఏర్పాటు చేశారు.

విద్యుత్ అధికారుల తనిఖీలు

మాట్లాడుతున్న హైమావతి

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఒంగోలు టౌన్ డి3 సెక్షన్‌లో ఇంటెన్సివ్ ఇన్స్పెక్షన్ (విజిలెన్స్) దాడులు విజిలెన్స్ ఈఈ టి.హైమావతి ఆధ్వర్యంలో నిర్వహించారు. ఈ దాడుల్లో 36 బందాలు పాల్గొన్నాయి. దాడుల్లో 2224 సర్వీసులు తనిఖీ చేశారు. ఈ సందర్భంగా విజిలెన్స్ ఈఈ హైమావతి మాట్లాడుతూ తనిఖీల్లో విద్యుత్ చౌర్యం చేస్తున్న వారిపై చర్యలు తీసుకుంటామని తెలిపారు. విద్యుత్ చౌర్యం చేస్తున్న వారిపై ఫిర్యాదు చేయడానికి 9440812358 మరియు 8074140274 నంబర్స్‌కి ఫోన్ చేసి సమాచారము ఇవ్వాలని కోరారు. ఈ దాడుల్లో 290 మందికి అదనపు లోడు, మాల్ ప్రాక్టీస్, బ్యాక్ బిల్లింగ్ కేసులు నమోదు కాగా రూ.13,37,400 అపరాధ రుసుము విధించినట్లు తెలిపారు. కార్యక్రమంలో ఈఈ ఆపరేషన్ మాకినేని హరిబాబు, విజిలెన్స్ డిఈఈలు వి.శ్రీనివాసరావు, ఏ.శ్రీనివాసరావు, కె.వెంకటేశ్వర్లు, టౌన్ డిఈఈ కెవి.పాండురంగారావు, రూరల్ 2 డిఈఈ టి.శ్రీకాంత్, విజిలెన్స్ ఏఈఈ కోటేశ్వరరావు పాల్గొన్నారు.

'స్వీకారం'లో పనులు మొదలుపెట్టేలా చర్యలు

అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

స్వీకారం' కార్యక్రమంలో సంక్షేమ వసతి గృహాలలో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు చేపట్టిన పనులను త్వరగా పూర్తి చేయడంతో పాటు చేపట్టాల్సిన పనులను త్వరగా మొదలుపెట్టేలా చూడాలని కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా అధికారులను ఆదేశించారు. శుక్రవారం సాయంత్రం కలెక్టర్ క్యాంపు కార్యాలయంలో కలెక్టర్ అధికారులతో సమావేశమై స్వీకారం కార్యక్రమంలో చేపట్టిన పనుల పురోగతిపై సమీక్షించారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ స్వీకారంలో భాగంగా సామాజిక బాధ్యతతో ముందుకొచ్చి హాస్టల్స్‌లో కనీస మౌలిక వసతులు కల్పించేందుకు సోషల్ వెల్ఫేర్ హాస్టళ్లను దత్తత తీసుకున్న సంబంధిత కార్పొరేట్ సంస్థల ప్రతినిధులను సమన్వయం చేసుకొని త్వరగా పనులు మొదలు పెట్టేలా చర్యలు తీసుకోవాలన్నారు. ఏ సంక్షేమ వసతి గహాన్ని ఏ కార్పొరేట్ సంస్థ దత్తతు తీసుకుంది, సంబంధిత వసతి గహంలో ఏఏ పనులు చేపట్టాలి, వాటికి సంబంధించిన ప్రతిపాదనలు తయారు చేయడం వంటి విషయాలను పర్యవేక్షణకు నోడల్ అధికారిని నియమించాలని కలెక్టర్ సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మా నాయక్‌ను ఆదేశించారు. సంబంధిత శాఖల అధికారులు ఈ పనుల పురోగతి పై ప్రత్యేక దృష్టి సారించాలని ఆదేశించారు. సమావేశంలో సోషల్ వెల్ఫేర్ డిడి లక్ష్మా నాయక్, సిపిఒ డి.వెంకటేశ్వర్లు, జిల్లా మత్స్య శాఖ అధికారి ఏ. చంద్రశేఖర్ రెడ్డి, పరిశ్రమల శాఖ జిఎం శ్రీనివాస రావు, బిసి వెల్ఫేర్ అధికారి అంజల, జిల్లా గిరిజన సంక్షేమాధికారి జగన్నాథరావు, మైనింగ్ శాఖ అధికారులు పాల్గొన్నారు.

ఏఒ సులోచన సేవలు ప్రశంసనీయం

- ఎస్‌పి ఏఆర్ దామోదర్ - ఘనంగా సత్కరించిన డిపిఒ సిబ్బంది

సులోచనను సత్కరిస్తున్న ఎస్పీ దామోదర్

ప్రజాశక్తి - ఒంగోలు కలెక్టరేట్

జిల్లా పోలీస్ కార్యాలయంలో సుదీర్ఘ కాలం పరిపాలనాధికారిగా పనిచేసిన ఎం.సులోచన సేవలు ప్రశంసనీయమని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ కొనియాడారు జిల్లా పోలీసు కార్యాలయంలో అడ్మినిస్ట్రేటివ్ ఆఫీసర్ (ఏఒ)గా అత్యుత్తమ సేవలు అందించి బదిలీల్లో భాగంగా ఏపిఎస్‌పి 9వ బెటాలియంకు బదిలీపై వెళుతున్న డిపిఒ ఏఒ యం.సులోచన వీడ్కోలు సభ శుక్రవారం జరిగింది. శుక్రవారం జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఒ సులోచనను జిల్లా ఎస్‌పి, పోలీస్ అధికారులు ఘనంగా సత్కరించి జ్ఞాపికలు అందజేశారు. ఈ సందర్భంగా ఎస్‌పి మాట్లాడుతూ సుమారు ఆరు సంవత్సరాల పాటు జిల్లా పోలీసు కార్యాలయంలో ఏఒ సులోచన అందించిన సేవలు అభినందనీయమన్నారు. జిల్లాలో పనిచేసే పోలీసు అధికారులు సిబ్బందికి అందవలసిన బకాయిలు, పదవీ విరమణ చెందిన సిబ్బందికి రావాల్సిన బెనిఫిట్స్ అందించడంలో , మరణించిన సిబ్బంది శాఖాపరమైన ప్రయోజనాలు వారి కుటుంబానికి అందజేయడంలో ఏఒ కషి చేశారన్నారు. ఎన్నికల సమయంలో విధులు బాగా నిర్వహించారన్నారు. బదిలీపై వెళ్లిన జిల్లాలో కూడా సిబ్బందికి ఉత్తమ సేవలు అందించాలని, వృత్తిజీవితంలో మరిన్ని పదోన్నతులు పొందాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో అదనపు ఎస్పీ (అడ్మిన్) కె.నాగేశ్వరరావు, ఎఆర్ అడిషనల్ ఎస్‌పి అశోక్ బాబు, ఎఆర్ డిఎస్‌పి చంద్ర శేఖర్, డిపిఒ కొత్త ఏఒ రామ్మోహన్, ఎస్‌బి ఇన్స్పెక్టర్ కెవి రాఘవేంద్ర, ఐటి కోర్ ఇన్‌స్పెక్టర్ వి.సూర్యనారాయణ, ఆర్‌ఐలు రమేష్ కష్ణన్, రమణా రెడ్డి, సీతారామరెడ్డి, ఏఏఒ ఉష్మాన్ బాషా, డిపిఒ సూపరింటెండెంట్‌లు, సిబ్బంది పాల్గొన్నారు.

జైలు జీవితాన్ని గుణపాఠంలా తీసుకోండి

- ఎస్‌పి ఏఆర్ దామోదర్
- జిల్లా జైలు సందర్శన

జైలులో పరిశీలిస్తున్న ఎస్‌పి దామోదర్

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఖైదీలు జైలు జీవితాన్ని ఒక గుణపాఠంలా తీసుకొని పరివర్తనతో మంచి భవిష్యత్తు వైపు సాగాలని జిల్లా ఎస్‌పి ఏఆర్ దామోదర్ సూచించారు. ఒంగోలులోని జిల్లా కారాగారాన్ని ఎస్‌పి శుక్రవారం సందర్శించారు. ఎస్‌పి జిల్లా కారాగారం పరిసరాలు, , ఖైదీల గదులు వంటి అన్ని ప్రదేశాలను తిరిగి పరిశీలించారు. జైలులో ఉన్న ఆడ, మగ ఖైదీలతో మాట్లాడి వారి నేర వివరాలు స్థితిగతులు అడిగి తెలుసుకున్నారు. జైలులో వారికి కల్పిస్తున్న మౌళిక వసతులు, సమస్యలు అధికారులను అడిగి తెలుసుకున్నారు. ఖైదీలతో జిల్లా ఎస్‌పి మాట్లాడుతూ ఒక వ్యక్తి గతంలో క్షణికావేశంలో నేరం చేసి జైలు జీవితాన్ని గడుపుతున్నప్పటికీ తప్పులను సరిద్దిదుకోవాలన్నారు. వారి జీవితాన్ని మంచిగా మలుచుకోవడం వారి చేతుల్లోనే ఉందని, జైలు జీవితాన్ని ఒక గుణపాఠంలా తీసుకొని సమాజంలో గౌరవంగా మంచి వ్యక్తులుగా పరివర్తన చెందాలన్నారు. జైలు నుండి విడుదల అయ్యాక మంచి భవిష్యత్తు వైపు అడుగులు వేయాలని ఆకాంక్షించారు. అంతర్గత భద్రతపై జైలు సెక్యూరిటీ కమిటీ వారితో మాట్లాడుతూ ఖైదీల పట్ల అప్రమత్తంగా ఉండాలని, భద్రత లోపాలు లేకుండా చూసుకోవాలన్నారు. ఎలాంటి భద్రతా సమస్య ఉన్నా వెంటనే తమ దష్టికి తీసుకొనిరావాలని ఎస్‌పి సూచించారు. జైలు అంతర్గత భద్రతపై, ఖైదీలలో పరివర్తన కోసం తీసుకోవలసిన మంచి చర్యలపై జైలు అధికారులకు పలు సూచనలు తెలియజేశారు. జైలు పరిసరాలు పరిశుభ్రంగా మరియు ఆహ్లాదకరంగా ఉన్నాయని జిల్లా ఎస్‌పి సంతృప్తి వ్యక్తం చేశారు. ఎస్‌పి వెంట జైలు సూపరింటెండెంట్ పి. వరుణా రెడ్డి, ఒంగోలు డిఎస్‌పి ఆర్.శ్రీనివాసరావు, ఎస్‌బి ఇన్‌స్పెక్టర్ కెవి రాఘవేంద్ర, ఒంగోలు తాలూకా సిఐ అజయ్ కుమార్, ఒంగోలు వన్ టౌన్ సిఐ నాగరాజు, జిల్లా జైలర్ రమేష్, శ్రీనివాసరావు, కారాగార వైద్యాధికారి డాక్టర్ ఎస్‌విఎస్ బ్రహ్మతేజ, జైలు సిబ్బంది ఉన్నారు.

జాబ్‌మేళా పోస్టర్ ఆవిష్కరిస్తున్న దృశ్యం

29న మెగా జాబ్ మేళా

ప్రజాశక్తి - అద్దంకి

మంత్రి గొట్టిపాటి రవికుమార్ సహకారంతో అసిస్ట్, నిపుణ స్వచ్ఛంద సంస్థల ఆధ్వర్యంలో అక్టోబర్ 29న పట్టణంలోని రహదారుల బంగ్లాలో నిర్వహించబోయే మెగా జాబ్ మేళా పోస్టర్‌ను శుక్రవారం విడుదల చేశారు. ఈ జాబ్ మేళాలో వెయ్యి మందికిపైగా ఉద్యోగ కల్పన కోసం 25కంపెనీలు వస్తున్నాయని తెలిపారు. 10వ తరగతి నుండి పీజీ వరకు చదువుకున్న యువతీ యువకులు ఈ మేళాను సద్వినియోగం చేసుకోవాలని కోరారు. కార్యక్రమంలో అసిస్ట్ సంస్థ సెక్రెటరీ జాష్టి కృష్ణ, నిపుణ అసోసియేట్ డైరెక్టర్, మున్సిపల్ కమీషనర్ రవీంద్ర, ఎంపిడిఒ శింగయ్య, టిడిపి నేతలు పాల్గొన్నారు.

పాలియేటివ్ కేర్ వ్యతిరేక ర్యాలీలో వైద్యాధికారులు

పాలియేటివ్ కేర్ వ్యాధి పట్ల అవగాహన

ప్రజాశక్తి - బాపట్ల

నిశ్శబ్ద ప్రాణాంతక వ్యాధుల్లో ఒకటైన పాలియేటివ్ కేర్ ప్రధానంగా క్యాన్సర్ రోగగ్రస్తులకు బాధ తెలియకుండా ఉపశమనం కలిగించేందుకు వైద్య ఆరోగ్య సిబ్బంది ప్రత్యేక వైద్య విధానాన్ని పాటించాలని వైద్య ఆరోగ్య శాఖ జిల్లా అధికారి ఎస్ విజయమ్మ అన్నారు. ప్రపంచ పాలియేటివ్ కేర్ వారోత్సవాల ముగింపు సందర్భంగా జిల్లాలో ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలు, సిహెచ్ఒలకు పాలియేటివ్ కేర్‌పై శుక్రవారం నిర్వహించారు. ప్రత్యేక శిక్షణ ముగింపు అనంతరం పట్టణంలో ఆశా కార్యకర్తలు, ఎఎన్ఎంలతో ర్యాలీ నిర్వహించారు. వృద్ధాప్యంలో ఉన్న వారికి రోగ నిర్ధారణతో సంబంధం లేకుండా సేవలు అందించడమే పాలియేటివ్ కేర్ ఉద్దేశ్యం అన్నారు. అందు కోసం వైద్య ఆరోగ్య సిబ్బంది వ్యాధి బారిన పడిన వ్యక్తుల కుటుంబ సభ్యులు తీసుకోవాల్సిన జాగ్రత్తలపై అవగాహన కల్పించాలని అన్నారు. కార్యక్రమంలో జిల్లా ఇమ్యునైజేషన్ అధికారి టి వెంకటేశ్వర్లు, డిప్యూటీ మాస్ మీడియా జిల్లా అధికారి బి మరియమ్మ, ఆశాలు, ఎఎన్ఎంలు, వైద్య ఆరోగ్య సిబ్బంది పాల్గొన్నారు.

గోడపత్రిక అంటిస్తున్న దృశ్యం

ఉచిత న్యాయ సహాయం

ప్రజాశక్తి - రేపల్లె

జాతీయ న్యాయ సేవ అధికార సంస్థ ఆధ్వర్యంలో అందరికీ అందుబాటులో ఉచిత న్యాయానికి కృషి చేస్తున్నదని సీనియర్ సివిల్ జడ్జ్ టి వెంకటేశ్వర్లు అన్నారు. స్థానిక తాలూకా కార్యాలయ ఆవరణలోని ప్రతి ఆఫీసు నందు జాతీయ న్యాయ సేవాధికార సంస్థ రూపొందించిన స్టిక్కర్లను సీనియర్ సివిల్ జడ్జి ఆవిష్కరించారు. గోడలపై స్టిక్కర్లు అందించారు. ఉచిత న్యాయ సహాయానికై 15100కు ఫోన్ చేయాలని కోరారు. ఉచిత న్యాయ సహాయం పొందవచ్చునని తెలిపారు. ఆన్లైన్లో దరఖాస్తులు చేసుకోవచ్చని తెలిపారు.

పంగులూరులో 'వెలుగు' రాజకీయం

- ప్రభుత్వం మారడంతో విఒఎల తొలగింపు
- హైకోర్టును ఆశ్రయించిన ఇద్దరు విఒఎలు
- రుణ మంజూరుకు సాంకేతిక ఇబ్బందుల్లో మహిళలు
- సమస్యతో తల పట్టుకుంటున్న వెలుగు సిబ్బంది

ప్రజాశక్తి - పంగులూరు

వెలుగు విభాగంలో రాజకీయం చిచ్చురేపింది. ప్రభుత్వం మారడంతో విఒఎల తొలగింపు మండలం లోని వివిధ గ్రామాల్లో రాజకీయ వేడి పుట్టిస్తుంది. విఒఎల తొలగింపు సవాలు చేస్తూ అధికార పార్టీ నేతలపై హైకోర్టును ఆశ్రయించారు. కోర్టు స్టే విధించడంతో అధికార పార్టీ నేతల చర్యలు చర్చకు వచ్చాయి. పొదుపు సంఘాల మహిళలు నెల నెలా దాచుకున్న డబ్బును బ్యాంకుల ద్వారా రుణాలు పొందుతూ కుటుంబాలకు ఆర్థికంగా తోడుగా నిలుస్తున్నారు. అలాంటి మహిళలకు ఇప్పుడు రుణం తీసుకోవాలంటే వీలు కావడం లేదు. కుటుంబ అవసరాల కోసం రుణం తీసుకోవడానికి ఎవరిని అడగాలో అర్థం కాని పరిస్థితి ఏర్పడింది. మీ గ్రూపులకు మేమే విఒఎలము, మేము మీకు రుణాలు ఇప్పిస్తామని కొత్తగా వచ్చినవారు అంటుంటే కాదు మాకు హైకోర్టు అనుకూలంగా తీర్పు ఇచ్చింది మేమే విఒఎలమని పాత వాళ్ళు చెబుతున్నారు. ఇద్దరూ పని చేయకుండా తాత్సారం చేస్తున్నారు. దీంతో రుణాల కోసం మహిళలు వెలుగు కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేకుండా పోతుంది. వెలుగు సిబ్బందిని అడిగితే రాజకీయాలతో ముడిపడి ఉండటంతో సిబ్బంది తల పట్టుకుంటున్నారు. మండలంలో 12వందల పొదుపు సంఘాలు ఉన్నాయి. ఒక్కో సంఘంలో 10 మంది మహిళలు ఉంటారు. 12వేల మంది మహిళలు డ్వాక్రా సంఘాల్లో ఉన్నారు. వీరికి మండలం మొత్తం మీద 38గ్రామైక్య సంఘాలు ఉన్నాయి. ఒక్కో గ్రామైక్య సంఘంలో 25 నుండి 40 వరకు డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి. ఒక్కో గ్రామైక్య సంఘానికి ఒక్కో విఒఎ ఉంటారు. ఈ విఒఎలు ఆ గ్రూపుల్లోని మహిళలకు బ్యాంకు రుణాలు, స్త్రీ నిధి రుణాలు ఇప్పించేందుకు పుస్తకాలు నిర్వహిస్తుంటారు. వీరికి ప్రభుత్వం నెలవారీ జీతం ఇస్తూ ఉంటుంది. ఇటీవల ప్రభుత్వం మారడంతో మండలంలో విఒఎల మార్పుపై అధికార పార్టీ దృష్టి సారించింది. ఇప్పటివరకు మండలంలో 18మంది విఒఎలను మార్చి తమకు అనుకూలమైన వారిని నియమించుకున్నారు. పంగులూరులోని ఐదుగురు విఒఎలను తొలగించారు. వారి స్థానంలో కొత్తవారిని నియమించారు. అయితే గతంలో ఉన్న పాత విఒఎల్లో ఇద్దరు తమను తొలగించడానికి వీలు లేదని, తమనే విఒఎలుగా కొనసాగించాలని కోరుతూ హైకోర్టును ఆశ్రయించారు. ఈ ఇద్దరి పరిధిలో ఒక సమైక్య సంఘంలో 33డ్వాక్రా గ్రూపులు, మరో సంఘంలో 32డ్వాక్రా గ్రూపులు ఉన్నాయి. అంటే ఈ రెండు సమైఖ్య సంఘాల పరిధిలో 650మంది డ్వాక్రా మహిళలు ఉన్నారు. హైకోర్టుకు వెళ్లిన విఒఎలు ఇద్దరూ కోర్టు తమకు అనుకూలంగా తీర్పు ఇస్తుందని, తామే విఒఎలుగా కొనసాగుతామని, తామే రుణాలు ఇప్పిస్తామని చెబుతున్నారు. వారి స్థానంలో కొత్తగా నియమించిన విఒఎలు రుణాలు ఇప్పించడానికి సాంకేతిక సమస్యలు ఏర్పడ్డాయి. దీనితో ఈ గ్రూపుల్లోని మహిళలు రుణాల కోసం వెలుగు ఆఫీసు చుట్టూ తిరగాల్సి వస్తుంది. వ్యవసాయ సీజను కావడంతో పొలాలకు పెట్టుబడుల కోసం, పిల్లల చదువుల కోసం, పెళ్ళిళ్ళ, ఇతర కుటుంబ అవసరాలు, ఆరోగ్యం వంటి రుణాలకు అవసరమైన రుణాలు పొందటానికి వీలు కావడం లేదు. గత మూడు నెలల నుండి వెలుగు ఆఫీస్ చుట్టూ తిరుగుతున్న విఒఎ కారణాలు చెబుతున్నారు. అధికార పార్టీ నాయకులు కొత్తగా నియమించిన వారిని కొనసాగించాలని కోరుతుండగా తమకు అనుకూలంగా కోర్టు తీర్పు వచ్చిందంటూ తమను కొనసాగించాలని తొలగించిన విఒఎలు పట్టుబడుతున్నారు. ఈ విషయమై వెలుగు కార్యాలయంలో ప్రతిరోజు పంచాయతీలు జరుగుతున్నాయి. వెలుగు సిబ్బంది ఏమి చేయాలో అర్థం కాక తల పట్టుకుంటున్నారు. గతంలో ఎన్నడూ లేని విధంగా 'వెలుగు' రాజకీయంతో గ్రామాల్లో వేడెక్కింది.

పంగులూరులోని వెలుగు కార్యాలయం

వరద తగ్గి నెలైనా ఇళ్ల ముందు నీళ్లే..

ప్రజాశక్తి - భట్టిప్రోలు

కృష్ణానదికి సంభవించిన వరదల తగ్గిపోయి 40 రోజులైంది. అయినప్పటికీ చింతమోటు గ్రామంలో ఇళ్ల చుట్టూ నీళ్ల మాత్రం తగ్గలేదు. గృహాల్లో నీరు నిలబడే ఉంది. దీని కారణంగా లంక గ్రామాల్లో ప్రజలు మురుగునీటి దుర్వాసనతో కాలం వెళ్లదీస్తున్నారు. దోమలు వృద్ధి చెంది పాములు, జెరులతో భయభ్రాంతులకు గురవుతున్నారు. దళిత వాడ సమీపంలో గోతిలో ఉన్న పది ఇళ్లలో నివసిస్తున్న కుటుంబాలు నీటిలోనే జీవించాల్సిన దుస్థితి ఉందని వాపోతున్నారు. కొల్లూరు మండలం గుంటూరు గూడెం సమీపంలోని ఇళ్లలో వరద నీళ్ల తగ్గకపోవడంతో నీటిలోనే నాని నివాసయోగ్యం లేక అవస్థలు పడుతున్నారు. సంబంధిత అధికారులు చర్యలు తీసుకుని నీటిని బయటకు మళ్లించాలని పదేపదే వేడుకుంటున్నప్పటికీ తమ గోడు పట్టించుకోవడం లేదని వాపోతున్నారు. చిన్న పిల్లలు, వృద్ధులు, మహిళలు ఇళ్లచుట్టూ చేరిన నీటి మధ్యలో నివసించడానికి అంటు వ్యాధులకు గురై ఇబ్బందులు పడుతున్నారు. ఈ మురుగునీటి కారణంగా ప్రతి ఇంటిలో విష జ్వరాల బారినపడి దుర్భర జీవితాన్ని గడుపుతున్నామని ఆవేదన వ్యక్తం చేశారు. నివాస గృహాల సమీపంలో గుంటూరు గూడెనికి చెందిన గ్రామస్తులు చెత్తాచెదారం గుట్టలుగా పోయుట వలన వర్షాలకు తడిచిపోయి దుర్వాసన వెదజల్లుతుందని ఆరోపిస్తున్నారు. వర్షపు నీరు, వరద నీరు నిల్వ ఉండటంతో ఇళ్లలో తేమచేరి అంటు వ్యాధులకు కారణం అవుతుందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వరదలకు పంట పొలాలు పూర్తిగా దెబ్బతిని ఖాళీ పొలాలైనప్పటికీ గోతిలో నీటిని బయటకు మళ్లించటానికి అధికారులు తగిన చర్యలు తీసుకోవటం లేదని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇలాగే ఉంటే మరిన్ని రోగాలు వస్తాయని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.

నేటికీ వరద నీటిలోనే చింతమోటు గ్రామస్తులు

వాలీబాల్ జిల్లా జట్టుకు విద్యార్థిని ఎంపిక

ప్రజాశక్తి - భట్టిప్రోలు

గుంటూరు జిల్లా వేజెండ్ల జెడ్‌పి ఉన్నత పాఠశాల్లో జరిగిన రాష్ట్ర స్థాయి వాలీబాల్ జట్టు ఎంపికలో భట్టిప్రోలు ఉన్నత పాఠశాల 10వ తరగతి విద్యార్థిని సయ్యద్ సబీనా ఎంపికైనట్లు పాఠశాల హెచ్ఎం సి రామకోటేశ్వరరావు తెలిపారు. ఉమ్మడి గుంటూరు జిల్లా అండర్ 17విభాగంలో ఎంపికైన విద్యార్థిని ఈనెల 21నుండి 23వరకు సత్యసాయి జిల్లా హిందూపూర్‌లో జరిగే వాలీబాల్ పోటీల్లో పాల్గొననున్నట్లు చెప్పారు. ఎంపికైన విద్యార్థిని సయ్యద్ సబీనా, ఆమె తల్లిదండ్రులు, పిఇటిలు చేబ్రోలు శ్రీనివాసరావు, ఎండి అనుల్ హక్‌లను పాఠశాల కరస్పాండెంట్ మల్లికార్జునరావు, ఇతర ఉపాధ్యాయులు శుక్రవారం అభినందించారు.

సయ్యద్ షబీనా

డాక్టరేట్ అందుకుంటున్న అధ్యాపకురాలు మంజులాదేవి

అర్థశాస్త్ర అధ్యాపకురాలికి డాక్టరేట్

ప్రజాశక్తి - చీరాల

స్థానిక సెయింట్ మార్క్స్ లూధరన్ జూనియర్ కళాశాల్లో అర్థశాస్త్ర అధ్యాపకురాలిగా పనిచేస్తున్న గారపాటి మంజులాదేవి డాక్టరేట్ అందుకున్నారు. ఈ సందర్భంగా కళాశాల సిబ్బంది శుక్రవారం హర్షం వ్యక్తం చేశారు. ఆచార్య నాగార్జున యూనివర్సిటీ ద్వారా మత్స్యకారుల సంఘం ఆర్థిక అభివృద్ధి, ఆంధ్ర ప్రదేశ్ ప్రకాశం జిల్లాలో ఒక అధ్యయనం అనే శీర్షికపై ఎ భారతీదేవి మార్గదర్శకంలో గారపాటి మంజుల దేవి పరిశోధన చేసి డాక్టరేట్ పొందటం శుభపరిణామని కళాశాల ప్రిన్సిపాల్ గారపాటి పుష్పరాజు అన్నారు. ఎఎన్‌యు ద్వారా సోషల్ సైన్సెస్ ఫ్యాకల్టీలో ఎకనామిక్స్ విభాగంలో డాక్టర్ ఆఫ్ ఫిలాసఫీ పిహెచ్‌డి పొందిన సందర్భంగా సహచర అధ్యాపక, అధ్యాపకేతర సిబ్బంది, విద్యార్థినీ, విద్యార్థులు, ఆత్మీయులు, స్నేహితులు, బంధువులు అభినందించారు.

తహశీల్దారు వద్ద నిరసన తెలుపుతున్న నాయకులు

నకిలీ కుల పత్రాలపై విచారణకు డిమాండ్

ప్రజాశక్తి - చీరాల

మండలంలోని వినాయకపురం, రామన్నపేటకు చెందిన కొందరు బిసి సామాజికవర్గానికి చెందిన వ్యక్తులు ఎస్టీ సామాజిక వర్గానికి చెందిన వారమంటూ తమ వారికి రావాల్సిన ప్రభుత్వ రిజర్వేషన్లను నకిలీ ధృవీకరణ పత్రాల ద్వారా ప్రభుత్వాన్ని ప్రజలను మోసం చేస్తున్నారని ఎరుకల హక్కుల పోరాట సమితి రాష్ట్ర అధ్యక్షులు ధర్మా ఆరోపించారు. ఎస్టీ కుల ధృవీకరణ పత్రాలు పొందిన బిసిలపై చట్ట పరమైన చర్యలు తీసుకోవాలని కోరారు. స్థానిక తహశీల్దారు కార్యాలయంలో నకిలీ కుల పత్రాలు పొందిన వ్యక్తుల పూర్తి వివరాలను తెలియ పరచి విచారణ చేయాలని కోరారు. ఎరుకుల వారికే రావలసిన రిజర్వేషన్లను ఎరుకల వాళ్లే పొందేలా అధికారులు చర్యలు చేపట్టాలని డిమాండ్ చేశారు. తమ ఎరుకుల కులంలో ఫంటా, మద్దెల ఇంటి పేర్లు అసలు ఎక్కడ లేవన్నారు. నకిలీ సర్టిఫికెట్లు పొంది ప్రభుత్వ రాయితీలను తమకు అందకుండా చేసిన వారిపై చట్టపరమైన చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు. అనంతరం పోలీసు స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు.

పురుగు మందు తాగి వృద్ధుడు ఆత్మహత్య

ప్రజాశక్తి - మార్టూరు

స్థానిక రామ్ నగర్ కాలనీలో నివాసం ఉంటున్న రామిశెట్టి వెంకటరమణ (65) వృద్ధాప్య సమస్యలతో బాధపడుతూ గురువారం రాత్రి తన నివాసంలో పురుగు మందు తాగి ఆత్మహత్యాయత్నం చేసుకున్నట్లు ఎస్ఐ షేక్ మహబూబ్ బాషా తెలిపారు. గమనించిన కుటుంబ సభ్యులు ఆయనను స్థానిక ప్రభుత్వ వైద్యశాలకు తరలించగా పరిస్థితి విషమంగా ఉండడంతో గుంటూరు ప్రభుత్వ ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ శుక్రవారం తెల్లవారు జామున మృతి చెందినట్లు తెలిపారు. మృతుని కుమారుడు బాల శ్రీనివాస్, గుంటూరు పోలీసులు ఇచ్చిన సమాచారంతో కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్లు తెలిపారు.

రైల్వే గేటు వద్ద నిలిచిపోయిన ట్రాఫిక్ (ఫైల్‌ఫోటో)

వాహనాలకు అనుమతి ఎప్పుడు?

ప్రజాశక్తి - భట్టిప్రోలు

మండలంలోని సూరేపల్లి రైల్వే గేటుపై నిర్మించిన ఫ్లైఓవర్ పనులు నెల రోజుల క్రితమే పూర్తయ్యాయి. నేటికీ వాహనాల రాకపోకలకు అనుమతి ఇవ్వకపోవడంతో వాహనదారులు తీవ్ర ఇబ్బందులకు గురవుతున్నారు. ఈ గేటు రైలు రావడానికి అరగంట ముందుగానే మూసి వేయటంతో వాహన చోదకులు అరగంటకుపైగా వేచి ఉంటున్నారు. గేటుకు ఇరువైపు లా వాహనాలు అధిక సంఖ్యలో నిలిచిపోతున్నాయి. దీంతో ట్రాఫిక్ పెరిగిపోతుంది. అవి సర్దుకోవటానికి మరో పావు గంటకుపైగా సమయం పడుతుంది. ఈ గేటును పూర్తిగా మూసివేసి దీనిపై నిర్మించిన ఫ్లైఓవర్ పనులు పూర్తయ్యాయని, మరో వారం రోజుల్లోగా వాహ నాల రాకపోకలకు అనుమతినిస్తామని సంబంధిత జాతీయ రహదారి నిర్మాణ, రైల్వే, రెవెన్యూ అధికారులు నెల రోజుల క్రితమే తెలిపారు. దీంతో త్వరలోనే ఫ్లైఓవర్‌పై రాకపోకల కొనసాగుతాయని ప్రయాణికు లంతా భావించారు. ఇది జరిగి నెల రోజులు అవుతున్న ప్పటికీ యథావిధిగానే ఇబ్బందులు కొనసాగుతు న్నాయి. రాత్రి 8 గంటల సమయంలో సికింద్రాబాద్ నుండి రేపల్లె వెళ్లే డెల్టా ఎక్స్‌ప్రెస్ ప్రయాణించే సమ యంలో అరగంట ముందుగానే గేటు మూసి ఉండటం తో ఇరువైపుల ద్విచక్ర వాహనదారులు ఆ ప్రాంతంలో దోమల మోతతో ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. భారీ వాహనాలు గేటు తెరిచిన అనంతరం ట్రాఫిక్కులో తప్పుకుని వెళ్ళడానికి అవకాశం లేక ఇబ్బందులు పడుతున్నామని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ఇప్పటికైనా ఫ్లైఓవర్ అనుమతులు ఇవ్వాలని కోరుతున్నారు.

నేర ప్రాంతాన్ని పరిశీలిస్తున్న డిఎస్పి శ్రీనివాసరావు

అట్రాసిటీ కేసుపై డీఎస్పీ విచారణ

ప్రజాశక్తి - భట్టిప్రోలు

ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ కేసుపై రేపల్లె డిఎస్పి ఆవుల శ్రీనివాసరావు శుక్రవారం విచారణ చేపట్టారు. మండలంలోని మద్యగూడెం గ్రామానికి చెందిన గొరిగిపూడి ప్రసాదు ఇచ్చిన ఫిర్యాదు ఆధారంగా పెదలంక గ్రామానికి చెందిన టిడిపి నాయకులు వేములపల్లి జగన్నాథ రావు, వేములపల్లి రత్న గోపాల్, వేములపల్లి రవిపై అట్రాసిటీ కేసు పోలీసులు నమోదు చేశారు. ఈ కేసుకు సంబంధించి నేరస్తులను, ఫిర్యాదుదారుడైన గొరగపూడి ప్రసాదు, సాక్షులను పెదలంక, మధ్యగూడెంలో విడివిడిగా విచారించారు. విచారణలో వెలుగు చూసిన అంశాలను వీడియో రూపంలో రికార్డు చేశారు. అంశాల పూర్వాపరాలు పరిశీలించిన అనంతరం కేసు స్వభావాన్ని బట్టి చర్యలు తీసుకోనున్నట్లు డిఎస్పి తెలిపారు. ఆయన వెంట ఎస్ఐ ఎం శివయ్య, పెదలంక విఆర్ఓ ఎం జకరయ్య, విఆర్ఎలు, పోలీస్ సిబ్బంది ఉన్నారు.

నేడు విద్యుత్ అంతరాయం

ప్రజాశక్తి - అద్దంకి

పట్టణ విద్యుత్ వినియోగదారులకు అంతరాయం లేకుండా విద్యుత్ సరఫరా చేసే నిమిత్తం పట్టణంలోని ఉత్తర అద్దంకి సబ్‌స్టేషన్ పరిధిలో మరమ్మత్తులు కారణంగా శనివారం ఉదయం 9 గంటల నుండి 12 గంటల వరకు విద్యుత్తు సరఫరా నిలిపివేయనున్నట్లు ఎఈ ఎన్ శ్రీనివాసరావు తెలిపారు. అంతరాయానికి వినియోగదారులు సహకరించాలని కోరారు.

రక్తహీనతకు చవకైన పరిష్కారం మునగాకు

కారంచేడులో మునగాకు ప్రాధాన్యత వివరిస్తున్న సునీత

ప్రజాశక్తి - కారంచేడు

మునగాకు తినడం వలన గర్భిణీలు, బాలింతలకు రక్తహీనత తగ్గుతుందని ఐసిడిఎస్ సూపర్వైజర్ సునీత చెప్పారు. అంగనవాడి సెక్టార్లో మునగాకు ఆహారం తినడం వలన జరిగే ఉపయోగాలపై శుక్రవారం అవగాహన కల్పించారు. మునగాకును ప్రతిరోజు ఆహారంలో తీసుకోవడం వలన గర్భిణీ స్త్రీలు, బాలింతలకు రక్తహీనత తగ్గి మంచి పోషకాలు అందుతాయని అన్నారు. వీటితోపాటు కంటిచూపు మెరుగవుతుందని తెలిపారు. వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుదన్నారు.

యద్దనపూడి : మండలంలోని యనమదల అంగన్‌వాడీ (ఎస్‌సి) కేంద్రం నందు శుక్రవారం తల్లుల సమావేశం నిర్వహించారు. సమావేశంలో సూపర్ వైజర్ సుజాత మాట్లాడుతూ వంటల్లో మనగాకు పొడి వాడినట్లయితే పోషకాలు అందుతాయని అన్నారు. మునగాకు ఉపయోగించి పదార్థాలు తయారు చేయటం గురించి వివరించారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు సౌభాగ్యం, సుబ్బలక్ష్మి, హేమలత, సహాయకులు మౌనిక పాల్గొన్నారు.

పంగులూరు : మన ఇళ్ల దగ్గర దొరికే మునగాకుతో ఎన్నో ప్రయోజనాలు ఉన్నాయని ఐసిడిఎస్ పంగులూరు సెక్టార్ సూపర్వైజర్ జయప్రద అన్నారు. మునగాకు ప్రాధాన్యతను ఆమె శుక్రవారం వివరించారు. మునగాకు తింటే 300రకాల రోగాలు దూరంగా ఉంటాయని చెప్పారు. ప్రోటీన్స్, క్యాల్షియం, పిండి పదార్థాలు, ఐరన్ ఇతర సూక్ష్మ పోషకాలు, శక్తి లభిస్తుందని తెలిపారు. మునగాకును వంటల్లో రకరకాలుగా వండుకోవచ్చని చెప్పారు. బాలింతలు, గర్భిణీ స్త్రీలు, కిషోర్ బాలికలకు మునగాకు ఎంతో ఉపయోగకరంగా ఉంటుందని తెలిపారు. మునగాకు ద్వారా మనుషులకు కావలసిన అన్ని రకాల పోషకాలు పొందవచ్చని చెప్పారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ కార్యకర్తలు డి స్వర్ణలత, సిహెచ్ సుకన్య, సరోజినీ, అన్నమ్మ, పీరాంబి పాల్గొన్నారు.

పర్చూరు : గర్భవతులు, బాలింతలకు మునగాకు ప్రాముఖ్యతను వివరించారు. సుక్ష్మపోషకాలు, కాల్షియం, ఐరన్, ప్రోటీన్స్ అన్ని మునగలో అధిక మొత్తంలో ఉంటాయని సూపర్వైజర్ పి దీపదేవి తెలిపారు. కార్యక్రమంలో అంగన్‌వాడి కార్యకర్తలు, లబ్ధిదారులు పాల్గొన్నారు.

యద్దనపూడిలో మునగాకు ప్రాధాన్యత వివరిస్తున్న సుజాత

జాబ్‌మేళాలో 32 మందికి ఉద్యోగాలు

ప్రజాశక్తి - అద్దంకి

ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, ఎన్టీఆర్ మెమోరియల్ డిగ్రీ కాలేజీ సంయుక్తంగా శుక్రవారం జాబ్ మేళా నిర్వహించారు. జోయాలూకాస్, టాటా కాపిటల్, హేటిరో డ్రగ్స్, అరబిందో ఫార్మసీ కంపెనీల ప్రతినిధులు ఇంటర్వ్యూలు నిర్వహించారు. ఇంటర్వ్యూలకు 67మంది అభ్యర్థులు హాజరయ్యారు. వీరిలో 32మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ప్రిన్సిపాల్ ఎంవి రత్తయ్య నిరుద్యోగ యువతీ యువకులను ఉద్దేశించి మాట్లాడారు. ఎంత పెద్ద ఉద్యోగమైన చిన్న ఉద్యోగంతోనే ప్రారంభమవుతుందని అన్నారు. తమ కళాశాల్లో జాబ్ మేళా నిర్వహించడం సంతోషంగా ఉందని అన్నారు. కంపెనీ ప్రతినిధులు దూర ప్రాంతం నుండి కళాశాలకు వచ్చి అభ్యర్థులను ఎంపిక చేసుకున్నందుకు కృతజ్ఞతలు తెలిపారు. జిల్లా ప్లేసెమెంట్ అధికారి శ్రీనివాస్, సీనియర్ కెమిస్ట్రీ లెక్చరర్ ఏడుకొండలు, స్కిల్ హబ్ కాలేజీ కో ఆర్డినేటర్ గోపినాథ్, వినోద్ కుమార్ పాల్గొన్నారు.

నగరం : స్థానిక వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ కళాశాల నందు ఆంధ్రప్రదేశ్ నైపుణ్యాభివృద్ధి సంస్థ, శ్రీ వెలగపూడి రామకృష్ణ మెమోరియల్ స్మారక కళాశాల సంయుక్తంగా జాబ్ మేళా నిర్వహించారు. టాటా కాపిటల్, అరబిందో ఫార్మసీ కంపెనీలు, ఎయు ఫైనాన్స్, మాస్టర్ మైండ్స్ ప్రతినిధులు ఉద్యోగాల ఎంపికకు ఇంటర్వ్యూలు నిర్వహించారు. 173మంది అభ్యర్థులు హాజరుకాగా 77మంది వివిధ కంపెనీల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. ఈ జాబ్ మేళాకు కళాశాల అకడమిక్ డైరెక్టర్ వి వెంకటేశ్వరరావు, కళాశాల ప్రిన్సిపాల్ డాక్టర్ అనగాని హరికృష్ణ, కళాశాల సెక్రటరీ, కరస్పాండెంట్ వల్లభనేని బుచ్చయ్య చౌదరి మాట్లాడారు. కార్యక్రమంలో ఎంప్లాయిమెంట్ ఎక్సేంజ్ జిల్లా అధికారి వైపి సౌఘంది, నైపుణ్యాభి వృద్ధి సంస్థ ఇన్‌ఛార్జి సిహెచ్ రవి కుమార్, స్కిల్ కాలేజీ కో ఆర్డినేటర్ ఎం బులియ్య పాల్గొన్నారు.

ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులు

ఎంపికైన అభ్యర్థులను అభినందిస్తున్న అనగాని హరికృష్ణ

వ్యవసాయంలో సాంకేతికత అలవర్చుకోవాలి

ప్రజాశక్తి - మార్టూరు

వ్యవసాయంలో క్షేత్ర స్థాయిలో సాంకేతికతను అందిపుచ్చుకునే విధంగా రైతు సేవా కేంద్రాల సిబ్బంది అవగాహన కలిగి ఉండాలని వ్యవసాయ శాఖ జిల్లా అధికారి వై రామకృష్ణ సూచించారు. స్థానిక ఎఎంసి యార్డులో రైతు సేవా కేంద్రాల సిబ్బందికి శుక్రవారం అవగాహన కల్పించారు. పంటల బీమా ప్రయోజనాలు రైతులకు అందాలంటే సిబ్బంది పంట కోత ప్రయోగాలు సరైన సమయానికి కేటాయించిన భూముల్లో నిర్వహించాలని తెలిపారు. నివేదికలను ఉన్నతాధికారులకు పంపించాలని చెప్పారు. రత్నకుమారి మాట్లాడుతూ రబీలో అమలు జరిగే ప్రధాని ఫసల్ బీమా యోజన పథకం వర్తించే పంటల గురించి రైతులకు తెలియజేయా లని అన్నారు. ఏరువాక కేంద్రం కో ఆర్డినే టర్ డాక్టర్ బాల మురళీధర్ నాయక్ మాట్లాడుతూ మొక్కజొన్నలో యాజమాన్య పద్ధతులు పాటించాలని చెప్పారు. పంటను ఆశించే పురుగుల నివారణ చర్యలు గురించి వివరిం చారు. శాస్త్రవేత్త ఎన్ కామాక్షి మాట్లాడుతూ శనగ, వరి అధిక దిగుబడులను ఇచ్చే నూతన వంగడాల గురించి వివరించారు. ఎడిఎలు కెవి శ్రీనివాసరావు, ఎన్ మోహన రావు, ధనరాజ్, ఎఒలు వి కిరణ్ కుమార్, కె వెంకటకృష్ణ, ఎస్‌విడి కుమారి, డి సుబ్బారెడ్డి, వేణుగోపాల్, శ్రీనివా సరావు, ఎన్ మీరమ్మ, సుధీర్, ఆదినారాయణ చౌదరి పాల్గొన్నారు.

మాట్లాడుతున్న వ్యవసాయాధికారి వై రామకృష్ణ

వరిపైరు పరిశీలిస్తున్న రేపల్లె ఎఒ విజయబాబు

తక్కువ ఖర్చుతో అధిక దిగుబడి

ప్రజాశక్తి - రేపల్లె

రైతులు సాగు ఖర్చులు తగ్గించుకుని అధిక దిగుబడులు సాధించేందుకు కృషి చేయాలని ఎఒ ఆర్ విజయ్ బాబు సూచించారు. మండలంలోని చోడాయిపాలెం, పిరాట్లంక గ్రామాల్లో పొలం పిలుస్తుంది కార్యక్రమం శుక్రవారం నిర్వహించారు. ప్రకృతి వ్యవసాయంపై రైతులు అవగాహన పెంచుకుని పర్యావరణ కాలుష్యం తగ్గించుకోవాలని సూచించారు. మానవ ఆరోగ్య విషయాలపై రైతులకు అవగాహన కల్పించారు. ఎలుకల సామూహిక నిర్మూలన గురించి అవగాహన కల్పించారు. సమగ్ర ఎరువులు వాడకం గురించి వివరించారు. పంట పొలాలను పరిశీలించి రైతులకు సలహాలు ఇచ్చారు. కార్యక్రమంలో విఎఎ లావణ్య, సర్పంచ్ కమతం రమాదేవి, కమతం విజయ కుమారి పాల్గొన్నారు.

నూతనంగా ఎన్నికైన సత్రం కమిటీ సభ్యులు

విశ్వబ్రాహ్మణ సత్రం కమిటీ ఎన్నిక

ప్రజాశక్తి - అద్దంకి

మండలంలోని సింగరకొండ శ్రీ ప్రసన్నాంజనేయ విశ్వబ్రాహ్మణ అన్నదాన సత్రంలో టిడిపి బిసి నాయకులు చెన్నుపల్లి కోటిలింగాచారి అధ్యక్షుతన శుక్రవారం జరిగిన సమావేశంలో అన్నదాన సత్ర పాలక మండలి నూతన కమిటీ అధ్యక్షులుగా పొన్నపల్లి బ్రహ్మానందం, ప్రధాన కార్యదర్శిగా చింతలపూడి వీరయ్య చారి, కోశాధికారిగా దేవరకొండ నాగేశ్వరావును ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. కార్యక్రమంలో గోళ్లపాటి వెంకటాచారి, చేబ్రోలు రవీంద్రచారి, ఆళ్లగడ్డ వీర సుందరాచారి, తక్కెళ్ళపాటి నాగేశ్వరరావు, ముప్పవరం బ్రహ్మం, కొండముది రమేష్, ముత్తలూరు హరిబాబు పాల్గొన్నారు.

భూ సమస్యలపై గ్రామ సభలు నిర్వహించండి

ప్రజాశక్తి - పర్చూరు

ఇటీవల భూముల రీసర్వే నిర్వహించిన గ్రామాల్లో రైతులు ఎదుర్కొంటున్న సమస్యలపై రెవెన్యూ గ్రామ సభలు నిర్వహించాలని కలెక్టర్ జెవి మురళి ఆదేశించినట్లు తహశీల్దారు బ్రహ్మయ్య తెలిపారు. దేవరపల్లి, గొల్లపూడి, అడుసుమల్లి, గర్నెపూడి గ్రామాల్లో గ్రామ సభలు నిర్వహించనున్నట్లు చెప్పారు. రైతులకు భూ వివాదాలు, సమస్యలు ఉంటే అర్జీలు ఇవ్వాలని తెలిపారు. ఈనెల 22న దేవరపల్లి, 23న అడుసుమల్లి, 24న గరునపూడి, 25న గొల్లపూడి గ్రామాల్లో రెవెన్యూ సభలు ఏర్పాటు చేయనున్నట్లు తెలిపారు. ఈ అవకాశాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని కోరారు.

ఎంఎల్‌ఎల సమావేశంలో కొండయ్య

ప్రజాశక్తి - చీరాల

తెలుగుదేశం కేంద్ర కార్యాలయంలో టీడీపీ జాతీయ అధ్యక్షులు, ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన మంగళగిరిలో జరిగిన ఎంపీలు, ఎంఎల్‌ఎల సమీక్ష సమావేశంలో శాసన సభ్యులు మద్దులూరి మాలకొండయ్య పాల్గొన్నారు.

భూగర్భ జలాలు

వినియోగించే గ్రామాలపై ప్రత్యేక దృష్టి

- నీటిమట్టం పెరిగేలా చర్యలు తీసుకోండి
- మోడల్ గ్రామంగా నికరంపల్లి ఎంపిక
- అధికారులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

భూగర్భజలాలను అధికంగా వినియోగించిన గ్రామాలపై ప్రత్యేక దష్టి పెట్టి తిరిగి నీటి మట్టం పెరిగేలా చర్యలు తీసుకుంటున్నట్లు కలెక్టర్ ఏ. తమీమ్ అన్సారియా తెలిపారు. ఇందులో భాగంగా మార్కాపురం మండలంలోని నికరంపల్లిని మోడల్ గ్రామంగా ఎంపిక చేశామన్నారు. ఈ గ్రామంలో భూగర్భ నీటిమట్టం పెంచడానికి తీసుకోవలసిన చర్యలపై శుక్రవారం ప్రకాశం భవనంలోని తన ఛాంబర్ లో సంబంధిత అధికారులతో ఆమె ప్రత్యేక సమీక్ష సమావేశం నిర్వహించారు. జిల్లాలో మొత్తం 57 గ్రామాలలో పరిమితికి మించి భూగర్భజలాలను వినియోగించినట్లు గుర్తించామని భూగర్భ జలవనరుల శాఖ డిప్యూటీ డైరెక్టర్ విద్యాసాగర్ సందర్భంగా కలెక్టర్ కు వివరించారు. వీటిలో 14 గ్రామాల్లో రిలయన్స్ ఫౌండేషన్, సార్డ్స్, ఎఫర్డ్ సంస్థలు ఇప్పటికే అధ్యయనం చేసి వాటర్ బడ్జెట్ ప్రణాళికను రూపొందించాయని ఆయన తెలిపారు. ఈ జాబితాను పరిశీలించిన కలెక్టర్ మాట్లాడుతూ నికరంపల్లిని మోడల్ గ్రామంగా ఎంపికచేసి భూగర్భ నీటిమట్టం పెరిగేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ దిశగా సంబంధిత శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని కలెక్టర్ దిశా నిర్దేశం చేశారు. ఈ నెల 23న నికరంపల్లిలో గ్రామసభ నిర్వహణకు ఏర్పాట్లు చేయాలని కలెక్టర్ సూచించారు. సమావేశంలో డ్వామా పీడీ జోసఫ్ కుమార్, ఎపిఎం ఐపి పీడీ పివి రమణ, జడ్పీ సిఇఒ బి.చిరంజీవి, జిల్లా వ్యవసాయ అధికారి డాక్టర్ ఎస్.శ్రీనివాస రావు, జిల్లా ఉద్యాన అధికారి వైఎల్ఎన్ఎం గోపీచంద్, ఆర్‌డబ్ల్యుఎస్ ఇన్‌చార్జి ఎస్ఈ డి. వెంకటరమణ, ఇరిగేషన్ అధికారులు, రిలయన్స్ ఫౌండేషన్ ప్రతినిధులు పాల్గొన్నారు.

భూ సమస్యలన్నీ పరిష్కరించేలా చర్యలు

సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్

ప్రజాశక్తి - బాపట్ల జిల్లా

భూ సమస్యలన్నీ పరిష్కరించేలా అధికారులు చర్యలు తీసుకోవాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. జిల్లాస్థాయి రెవెన్యూ సదస్సు శుక్రవారం స్థానిక కలెక్టరేట్‌లో జరిగింది. తమ భూములకు సంబంధించిన సమస్యలు పరిష్కరించాలని కోరుతూ కార్యాలయాలకు వచ్చే వారి పట్ల నిర్లిప్తంగా ఉండరాదని జిల్లా సంయుక్త కలెక్టర్ హెచ్చరించారు. బాధితుల సమస్యలు క్షుణ్ణంగా పరిశీలించిన తదుపరి నాణ్యతతో వాటిని పరిష్కరించాలన్నారు. నాణ్యతతో పరిష్కారం కాని అర్జీలన్నీ పునరావతం అవుతున్నాయని చెప్పారు. ప్రజలు సంతప్తి చెందేలా వారి అర్జీలను నాణ్యతతో పరిష్కరించాలని సూచించారు. ఒకే ప్రాంతం నుంచి పలుమార్లు అర్జీలు వస్తుంటే కలెక్టరేట్ కు సమాచారం ఇవ్వాలన్నారు. క్షేత్రస్థాయిలో పర్యటించి బాధితుల సమస్యలు పరిష్కరించడంతోపాటు సంబంధిత అధికారులపై చర్యలు

మాట్లాడుతున్న సంయుక్త కలెక్టర్ ప్రఖర్‌జైన్

తీసుకుంటామన్నారు. రెవెన్యూ అధికారులు, సిబ్బంది డిప్యూటేషన్ కావాలని సిఫార్సులు చేస్తే సీసీఎల్ఏకు సరెండర్ చేస్తామని స్పష్టం చేశారు. రేషన్ దుకాణాలలో సమస్యలపై నమోదైన 142 అర్జీలను పరిష్కరించాలన్నారు. చౌక దుకాణాలలో ఖాళీలను షెడ్యూల్ ప్రకారం భర్తీ చేయాలన్నారు. జిల్లాలో 150 ధాన్యం కొనుగోలు కేంద్రాలు ఏర్పాటు చేయాలని, రైతుల కోసం కలెక్టరేట్ లో కంట్రోల్ రూమ్ ఏర్పాటు చేయాలన్నారు. నీటి సంఘాల ఎన్నికలు షెడ్యూల్ ప్రకారం సమర్ధంగా నిర్వహించాలని జిల్లా సంయుక్త కలెక్టర్ ప్రఖర్ జైన్ తెలిపారు. ఇందుకోసం ముందస్తుగానే ఓటర్ల జాబితా రూపొందించాలన్నారు. గుంటూరు పరిధిలోని శాసనమండలి గ్రాడ్యుయేట్ ఎన్నికల నోటిఫికేషన్ ఉన్నందున ఓటర్ల జాబితా సిద్ధం చేయాలన్నారు. నవంబర్ ఆరో తేదీలోగా వచ్చిన దరఖాస్తులను తక్షణమే పరిశీలించి పరిష్కరించాలన్నారు. ఎస్టీలలో 50 సంవత్సరాలు దాటిన వారికి పింఛన్ పొందే అవకాశం ప్రభుత్వం కల్పించినందున ఆధార్ కార్డులు, జనన ధ్రువీకరణ పత్రాలు తక్షణమే జారీ చేయాలని రెవెన్యూ అధికారులను ఆయన ఆదేశించారు. భూముల సర్వే, తదితర అంశాలపై జిల్లా సంయుక్త కలెక్టర్ సమీక్ష నిర్వహించారు. ఈ సమావేశంలో జిల్లా రెవెన్యూ అధికారి సిహెచ్ సత్తిబాబు, ఆయా శాఖల జిల్లా అధికారులు, బాపట్ల, చీరాల, రేపల్లె ఆర్డీవోలు, తహసిల్దార్లు పాల్గొన్నారు.

నివాసాల మధ్య మద్యం షాపు వద్దు

ప్రజాశక్తి-కనిగిరి

నివాసాల మధ్య మద్యం షాపు ఏర్పాటు చేస్తే సహించబోమని కనిగిరి పట్టణంలోని ఆర్టీసీ డిపో డౌన్‌లో మద్యం షాపు వద్ద కేశిరెడ్డి కాలనీకి చెందిన మహిళలు ఆగ్రహం వ్యక్తం చేశారు. మద్యం విక్రయాలను శుక్రవారం అడ్డుకొని నిరసన తెలిపారు. ఎస్ఐ శ్రీరామ్ పోలీస్ సిబ్బందితో సంఘటనా స్థలానికి చేరుకొని మహిళలతో మాట్లాడారు. మద్యం షాపు సమస్యపై ఎక్సైజ్ ఉన్నతాధికారులకు వినతిపత్రం ఇవ్వాలని కోరారు. మహిళలు మద్యం షాపు వద్ద ఆందోళన విరమించి..

మద్యం విక్రయాలను అడ్డుకున్న మహిళలు

నిరసన తెలుపుతున్న మహిళలు

సంబంధిత అధికారులకు తెలియజేస్తే సమస్య పరిష్కారమవుతుందని సూచించారు. దీంతో మహిళలు ఆందోళన విరమించారు.

జిజిహెచ్‌లో పనిచేయని లిఫ్టులు

ఇబ్బందులు పడుతున్న రోగులు, సహాయకులు

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

జిల్లాలోనే పెద్దాసుపత్రి అయిన ప్రభుత్వ సర్వజన వైద్యశాలలో లిఫ్టులు పనిచేయకపోవడంతో రోగులు తీవ్ర ఇబ్బందులు పడుతున్నారు. ఇక్కడ మొత్తం మూడు చోట్ల లిఫ్టులు ఉన్నాయి. ఓపీ విభాగం వెనుక ఒకటి, సాధారణ వైద్యవిభాగం పక్కన మరొకటి, డయాలసిస్ సెంటర్ వద్ద ఇంకొకటి.. ఉండగా వీటిలో సాధారణ వైద్యవిభాగం పక్కన ఉన్న లిఫ్ట్ మాత్రమే పనిచేస్తోంది. మిగతా రెండు లిఫ్టులు పనిచేయటం లేదు. గురువారం నాడు మంత్రి డోలాబాల వీరాంజనేయస్వామి, కలెక్టర్ తమీమ్ అన్సారియా, ఒంగోలు ఎమ్మెల్యే దామచర్ల జనార్ధన్

పనిచేసే ఒక్క లిఫ్ట్ వద్ద రద్దీ..

తదితరులు ఆకస్మికంగా జిజిహెచ్‌లో తనిఖీ చేశారు. ప్రభుత్వ వైద్యశాలల్లో మెరుగైన

పనిచేయని రెండు లిఫ్టులు

సదుపాయలు కల్పిస్తామని చెప్పారు. జిల్లాలోనే ప్రధానమైన ప్రజాప్రతినిధులు, ఉన్నతాధికారులు వచ్చి వెళ్లినా సమస్యలేవీ పరిష్కారం కాలేదని అక్కడి రోగులు పెదవి విరుస్తున్నారు. లిఫ్టులు బాగు చేయించాలని కోరుతున్నారు.

మెరుగైన వైద్యసేవలపై ప్రత్యేక శ్రద్ధ

- వైద్యులకు కలెక్టర్ తమీమ్ అన్సారియా ఆదేశం
- ఎంసిహెచ్‌లో ఆకస్మిక తనిఖీ

ఎంసిహెచ్‌లో వైద్యాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ తమీమ్ అన్సారియా

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్యసేవలు అందించడంలో వైద్యాధికారులు ప్రత్యేక శ్రద్ధ తీసుకోవాలని జిల్లా కలెక్టర్ ఏ.తమీమ్ అన్సారియా వైద్యులను ఆదేశించారు. శుక్రవారం ఉదయం ఒంగోలులోని మాతాశిశు వైద్యశాలను కలెక్టర్ ఆకస్మికంగా తనిఖీ చేసి.. రోగులకు అందిస్తున్న వైద్య సేవలను పరిశీలించారు. ఈ సందర్భంగా ఆసుపత్రిలోని ఓపి రిజిస్ట్రేషన్ విధానాన్ని, సంబంధిత రిజిస్టర్స్‌ను పరిశీలించారు. జనరల్ ఓపి వార్డు, ఎన్టీఆర్ వైద్యసేవల కౌంటర్ ఆపరేషన్ థియేటర్, పోస్ట్ నెటల్ వార్డు, కాన్పుల వార్డు, స్టెరిలైజేషన్ రూమ్, యాంటినెటల్ వార్డు వంటి విభాగాలను క్షుణ్ణంగా పరిశీలించి ఆస్పత్రిలో రోగులకు అందిస్తున్న వైద్య సేవలు, సౌకర్యాలపై వివరాలు తెలుసుకున్నారు. పారిశుధ్యం, సెక్యూరిటి సిబ్బంది వివరాలను, వారి హాజరు రిజిస్టర్‌ను పరిశీలించారు. ఆసుపత్రిలో రోగులకు అందిస్తున్న వైద్యసేవల వివరాలను రోగులను అడిగి తెలుసుకున్నారు. ఆసుపత్రికి వచ్చే రోగులకు మెరుగైన వైద్య సేవలతోపాటు నిర్వహణ, పారిశుధ్య ఏర్పాట్లపై వైద్యులు ప్రత్యేక దష్టి సారించాలని వైద్యులను ఆదేశించారు. కలెక్టర్ వెంట ఇన్‌ఛార్జి డిసిహెచ్ఎస్ సూరిబాబు, ఆసుపత్రి సూపరింటెండెంట్ డాక్టర్ సంధ్య, ఆసుపత్రి వైద్యులు, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

తనిఖీలు ఉపయోగమే.. కానీ..

మందుల్లేకుండా వైద్యం ఎలా.?

ప్రజాశక్తి-ఒంగోలు కలెక్టరేట్

కలెక్టర్ తమీమ్ అన్సారియా జిల్లాలోని ప్రభుత్వ వైద్యశాలల్లో ఆకస్మిక తనిఖీలు ముమ్మరంగా చేస్తున్నారు. ఫలితంగా వైద్యుల్లో, సిబ్బందిలో అప్రమత్తత పెంచి.. పేదలకు వైద్యం సరిగ్గా అందేలా చర్యలు తీసుకుంటున్నారు. ఆకస్మిక తనిఖీలు చేపట్టేటప్పుడు కనీసం తన వెంట ఉండే సిబ్బందికి కూడా ఎక్కడికో చెప్పడం లేదు. ఇది మంచి పరిణామం. కలెక్టర్ ఆకస్మిక తనిఖీల పేరుతో వైద్యసిబ్బందిలో నిర్లక్ష్యం తగ్గుతోంది. ఇంతవరకు బాగానే ఉన్నా.. ప్రభుత్వ వైద్యశాలల్లో ముఖ్యంగా డిసిహెచ్ఎస్ పరిధిలోని ఎక్కువ వైద్యశాలల్లో మందుల కొరత తీవ్రంగా ఉంది. శుక్రవారం కలెక్టర్ తనిఖీ చేసిన మాతాశిశువైద్యశాల విషయమే తీసుకుంటే.. ఈ వైద్యశాలలో ప్రధానంగా పాంటాప్ ఇంజక్షన్ అందుబాటులో లేదు. ఆసుపత్రిలో డెలివరీ కోసం చేరిన గర్భిణులకు గ్యాస్ట్రిక్ సమస్య రాకుండా పాంటాప్ ఇంజక్షన్ తప్పనిసరి. వైద్యశాలలో ఈ ఇంజక్షన్ లేకపోవడం వల్ల బయట కొనుగోలు చేయాల్సి వస్తుంది. కానీ నిధుల్లేవు.. ఈ ఇంజక్షన్ ఖరీదు సుమారు రూ.50.. ఒక్కో పేషెంట్‌కు ఐదు నుంచి వారం రోజుల పాటు మిగతా మెడిసిన్స్‌తో పాటు ఈ ఇంజక్షన్ కూడా వేయాల్సి ఉంటుంది. అంటే ఈ ఇంజక్షన్‌కే ఒక పేషెంట్‌కు సుమారు రూ.250 నుంచి రూ.350 ఖర్చు.. ఇక్కడ నిత్యం వంద మందికి పైగా గర్భిణులు ఇన్‌పేషెంట్లు

ఎంసిహెచ్‌లో పేషెంట్లను అడిగి సమస్యలు తెలుసుకుంటున్న కలెక్టర్

గా ఉంటారు. ఈ లెక్కన అందరికీ కలిపి కొన్ని వేల రూపాయలు ఖర్చవుతుంది. ఈ మొత్తాన్నీ ఇవ్వాల్సిన బాధ్యత ప్రభుత్వానిదే.. ప్రస్తుతం డాక్టర్ల డబ్బుతో ఈ మొత్తాన్ని ఖర్చు పెడుతున్న పరిస్థితి. రాన్‌టాక్ లాంటి టాబ్లెట్ల వల్ల రియాక్షన్ వస్తోంది. వీటికి ప్రత్యామ్నాయంగా వైద్యుల సూచనతో ఇంకో టాబ్లెట్ ఇవ్వాల్సి ఉంటుంది. ఇదీ బయట కొనాల్సిందే.. చీమకుర్తి సిహెచ్‌సిలో సెలైన్లు కూడా లేని పరిస్థితి. ఇలా డిసిహెచ్ఎస్ పరిధిలోని ఎక్కువ ఆసుపత్రులలో ఇదే పరిస్థితి ఉంది. కలెక్టర్ తనిఖీలతో వైద్యులు బాగా పనిచేసినా మందులు లేకుండా మాటలతో వైద్యం చేయలేరుగా.? మందుల కొరత సమస్యను పరిష్కరించేలా కలెక్టర్, ప్రజాప్రతినిధులు చర్యలు తీసుకోవాల్సి ఉంది.